# అంతరంగ తరంగాలు

పార్వతికి కళ్ళలోంచి మంటలు రేగుతున్నాయి. ఇసుక పోసినట్లుగా గరగర. ఎటు కదిలినా ఒళ్ళు నొప్పులే.

జడ వూడిపోయి, జుట్టు చిక్కులుపడి చిరాకుగా వుంది. గది నిండా చీకటి. మూలగా పార్వతి నేలమీద పడుకుని వుంది. బలవంతంగా ఒకటి రెండు సార్లు కళ్ళు తెరిచింది.

కళ్ళు మూసినా, తెరిచినా ఒకేలాగ వుంది. అంతా నల్లగా పేరుకున్న చీకటి - చూపు మూసుకుపోలేని చీకటి —

పార్వతి నెమ్మదిగా లేచి, కిటికీ రెక్క ఒకటి తీసి బయటకి చూసింది. దూరంగా దీపాలు వెలుగుతున్నాయ్. ఎంత సమయం అయిందో ఏమో తెలీదు ' .... అది రాత్రన్నమాట.... ' తను ఎన్ని గంటలు అలా పడివుందో ఊహించటానికి ప్రయత్నిస్తోంది — కిటికీ రెక్క మూసేసి మళ్ళీ ముడుచుకుని కూర్చుంది.

మనసు నిండా బాధ, భయం, నిరాశా, ఇంకా బ్రతికి వున్నందుకు దుఃఖం సముద్రపు టలలుగా పొంగుతున్నాయి. ఏడ్చేందుకు ఓపికలేదు. కళ్ళల్లో నీరు నిండుకుంది, ఆశ నిరాశల గురించి మనసుకి ఆలోచించే శక్తిలేదు. అది మొద్దుబారిపోయింది.

తలుపు తోసుకుని సుభద్రమ్మ లోపలికొచ్చింది, ఆమె చేతిలో కోడిగుడ్డు దీపం - ఆ దీపపుకాంతిలో తల్లికి తన మీద వున్న అసహ్యం స్పష్టంగా చదివింది పార్వతి. కడుపులో ఆకలో, మంటో తెలియకుండా

భగ్గుమంది. రోజూ ఆప్యాయంగా అన్నం పెట్టే అమ్మ కనిపించగానే అనుకోకుండా ఆకలి తలెత్తింది. కాని తనకింక అన్నంపెట్టి, అమ్మ ఆదరించదు. ఆప్యాయత అసలే చూపించదు.

సుభద్రమ్మ దీపం పెద్దదిచేసి, వెళ్ళిపోయింది. పార్వతి అహం దెబ్బతింది. అర్హత లేని అహంకారం దుఃఖంగా గుండెల్లో గుబగుబ లాడింది. అసహాయత ఆమెని మరింత కృంగదీసింది.

సుభద్రమ్మ అన్నంకంచం, మజ్జిగ గ్లాసు కూతురి ముందు పెట్టి వచ్చేసింది. పార్వతి తల్లి ముఖంలోకి చూడాలని ప్రయత్నించింది. కాని సుభద్రమ్మ ముఖం తిప్పుకుని వెళ్ళిపోయింది.

ఆ తల్లి మనసులో సున్నపు గుల్ల వుడకేసినట్లుగా వుంది. మండువాలో మంచం వాల్చుకుని పడుకుంది. ఎంత కోరుకున్నా ఆమె మనసుకి శాంతిలేదు. నిస్సత్తువగా కళ్ళుమూసుకుని పడుకుంది. వద్దను కున్నా ఆలోచనల పరంపరలు ఆమెని తొలిచేస్తున్నాయి.

'తనెన్నడూ కలలోనైనా ఊహించని విషయం జరిగిపోయింది. ముక్కుపచ్చారని పార్వతిలో ఇన్ని ఆలోచనలు, ఇంత తెగింపు, ఇంత అత్యాచారం వుందని తనూహించలేకపోయింది.

పార్వతి పదహారు రోజుల పిల్లగా వున్నప్పుడు కదూ తన పసుపూ కుంకం గంగపాలై పోయింది! ఆనాటి నుంచి తన పంచ ప్రాణాలు పార్వతిమీద పెట్టుకుని బ్రతుకొచ్చింది. పుట్టింటికి చేరినా తన డబ్బు తను పెట్టుకుని గుట్టుగా గడిపింది. పార్వతిని తన తమ్ముడి కిచ్చి చెయ్యడం నిజానికి అమ్మకిష్టంలేదు. వాడికీ, దీనికీ పదమూడేళ్ళు తేడా. అయినా తనే పట్టుబట్టి పెళ్ళి చేసింది. తనమీద అభిమానం కొద్దీ, తన జీవితంమీద జాలికొద్దీ, తను మరో విధంగా పార్వతి పెళ్ళి చెయ్యలేకపోతాననే సానుభూతితోటీ చిట్టిబాబు ఒప్పుకున్నాడు.

ఈ పాపిష్టిది ఇలాంటిదని తెలిస్తే బంగారంలాంటి తన తమ్ముడికి కట్టబెట్టేది కాదు. అయినా తనకి రంపపుకోత రాసిపెట్టి వుంటే తప్పించటం ఎవరితరం ?'

సుభద్రమ్మ అస్తిమితంగా కదిలింది. సినిమా మధ్యలో కరెంటు పోయినట్లు ఆలోచనలు తెగిపోయాయి. ఏ బొమ్మా పడని తెల్లని తెర లాంటి భవిష్యత్తు.

కదలకుండా పడుకుంటే చాలు. అలా కళ్ళు మూస్తే చాలు - రొద చేస్తూ గతంలోని జ్ఞాపకాలు, రోదిస్తూ భవిష్యత్తూ భయంకరంగా కదులుతున్నాయి.

'పదిహేనేళ్ళు నిండని పార్వతికి ఇంత తెగింపా ?

ఇంత ధైర్యమా ! ! అసలా వెధవని పట్టుకుని ముక్కలుగా తరిగి కాకులకీ, గద్దలకీ వెయ్యాలి —'

సుభద్రమ్మ ఎంత కసిగా ఆలోచించినా మనసుకి శాంతి లభించటం లేదు.

అన్నం కనిపించగానే పార్వతిలో ఆకలి భగ్గుమంది. తల్లి వస్తుందని, పలకరిస్తుందనే ఆశ చచ్చిపోయింది. నెమ్మదిగా కంచం ముందుకు లాక్కుని కలుపుకుంది. మొదటి ముద్ద నోట పెట్టగానే గొంతు పట్టేసింది. దుఃఖం మరింతగా గొంతును పూడ్చేసింది. అన్నం అసహ్యంగా అనిపించింది. కంచం తోసేసింది. గ్లాసులోని మజ్జిగ తాగేసి, మోచేతి మీద తల ఆన్చుకుని ముడుచుకుని పడుకుంది. జుట్టు పట్టుకుని ఈడ్చుకొచ్చాడు మావయ్య. అందుకే తలంతా నొప్పిగా వుంది. మాడు పుండులా బాధ పెడుతోంది.

అసలు తనకేం జరిగింది ? తనెందుకలా చేసింది ? ఏమో ! అయినా తనేం చేసింది ? ఎంత ఆలోచించినా అయోమయంగా వుంది.

బాధగావుంది. బుచ్చి పాపరాజు కూడా బాధపడుతూనే వుంటాడు. మావయ్య పాపరాజును చంపేద్దామనుకున్నాడు.

ఈ ఆలోచనతో పార్వతి ఒక్క క్షణం చివురుటాకులా వణికి పోయింది.

'మామయ్యని తల్చుకుంటే తనకెప్పుడూ పెద్దపులి గుర్తుకొస్తుంది. మావయ్య తనకి మొగుడు అని ఎప్పుడూ అనిపించదు. అక్కయ్యా, అక్కయ్యా అంటూ అమ్మ చుట్టూ తిరుగుతాడుగాని తనతో మాటా పలుకూ వుండదు. నవ్వు మర్చిపోయిన మనిషిలా ఎప్పుడూ మటమట లాడుతూ వుంటాడు. ఎప్పుడైనా నవ్వినా అది అమ్మతో మాట్లాడేటప్పుడే! పెళ్లి చేసుకున్నా మావయ్య తనమీద ఎప్పుడూ పెద్ద ఇష్టం చూపించడు. తనతో ఏకాంతం, తనతో సరసం, తనతో ఆనందం ఇవేమీ మావయ్యకు అక్కర్లేదు'

అక్కడికీ అమ్మమ్మ ఒకసారి "ఆ కాస్త అడ్డూ తొలగించెయ్. వాళ్ళనో మంచి రోజు చూసి గదిలోకి పంపించు" అంది అమ్మతో. కాని ఆ మాటలు అమ్మ కొట్టిపారేసింది.

"ఆ రోజు తనెంత తత్తరపడింది? చిత్రంగా అనిపించింది. చీకటి పడకుండానే వొళ్ళంతా పులకింతగా అనిపించింది. అమ్మ పూలజడ వేస్తుందనీ, పాల నురుగులాంటి తెల్లచీర తీసి ఇచ్చి కట్టుకోమంటుందనీ, ఇంకా ఏవేవో అనిపించాయి. ఎవ్వరూ చూడకుండా పెరట్లో మల్లె పందిరి ఎక్కి ఎన్ని మొగ్గలున్నాయో చూసుకొచ్చింది. పెళ్ళిరోజు పక్కింటి శారద రహస్యంగా ఇచ్చిన సెంటు సీసా వెదికి పెట్టుకుంది. ఆ రోజు తన ఊహల నిండా ఎన్నో కొత్త కోర్కెలు చోటుచేసుకున్నాయి. ఆ కోర్కెల మధ్య, ఆ ఊహల మధ్య, ఆ బంగారు కలల మధ్య మావయ్య మాత్రం లేడు - మరి ఎవరున్నారు? ఏమో! ఎవ్వరూ లేరేమో. అవును ఎవ్వరూ లేరు. నిజం. ఎవ్వరూ లేరు ....

" కానీ ఆ రోజు అమ్మ ఏమీ చెప్పలేదు.

" చాల్లేవే నీ చాదస్తం. దానికింకా పదిహేనేళ్ళు లేవు. అప్పుడే ఏ మొచ్చె? నీ ముసలితనపు ఆలోచనలూ నువ్వూ ...." అంటూ అమ్మమ్మ మీద విరుచుకుపడింది అమ్మ. అమ్మమ్మ లోపల్లోపల సణుక్కుంది పైకి ఏమీ అనలేదు.

తనారోజు కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగింది. తనెందుకలా తిరిగిందో ఎవ్వరికీ తెలీదు. నిజానికి తనకే తెలీదు ....

పార్వతి చెంపల మీంచి కన్నీళ్ళు వాలికి మోచెయ్యి తడిసింది.

బుచ్చి పాపరాజు మొదటి రోజున వచ్చినప్పుడు తన మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది.

" మన రామచంద్రరాజుగారబ్బాయి ఎంత బాగా పాటలు పాడుతాడో " అంటూ అమ్మమ్మ అంటుంటే చూసింది. చూపు మరల్చుకో లేకపోయింది. అతని పాట చెవుల్లో శాశ్వతంగా మోగుతోంది. అతను రోజూ వచ్చినా, పాటలు పాడినా, తనూ అతనితో కూనిరాగాలు తీసినా, అమ్మగానీ, అమ్మమ్మగానీ పట్టించుకోలేదు. ప్రేమ అంటే ఏమిటో తెలీదు తనకి. అదేదో పుస్తకాల్లో వుంటుందంటారు. కానీ బుచ్చిపాపరాజు, తనూ కలుసుకున్న ఆ కొన్ని క్షణాల పేరు ప్రేమ అనుకుంది తను.

ఒకరు లేకపోతే మరొకరు లేరు - అదే తమిద్దరికీ తరుచు అనిపించేది. రాజు తనని రమ్మన్నప్పుడు తనకి ఆకాశంలో ఎగురు తున్నట్లు, పచ్చటి వనాలలో పరుగు పెడుతున్నట్లు, వెన్నెలలో స్నానం చేస్తున్నట్లూ అనిపించేది.

తనేమిటో తనకి గుర్తురాలేదు. ఆదమరచి పారిపోయిన తమ ఇద్దర్నీ, స్వర్గం మొగసాల నుంచి, ఆనందపుటంచుల అవుడ దూరంనించి, మావయ్య జుట్టు పట్టుకుని లాక్కొచ్చినప్పుడు - ఈ శరీరం, మనసు అవమానంతో దహించుకుపోయాయి.

ఏమిటి ? ఏమైంది ? ఒక ఉన్మాదస్థితి.... మావయ్య తనని గదిలోకి బలంగా నెట్టి " అక్కయ్యా, ఇదిగో నీ కూతురు. అక్కడే నరికి పారేసేవాణ్ణి. నీ కడుపుతీపికోసం, నా పరువుకోసం ప్రాణాలతో తీసుకొచ్చా. ఈ దౌర్భాగ్యురాలి వంటిమీద చెయ్యివేస్తే నేను ఘండాలుడ్నే " అన్న మాటలు గుండెల్లో గూడుకట్టుకుని క్షణ క్షణం కాకిగోల చేస్తున్నాయి.

*

తూరుపు తెల్లవారింది. అందరి ముంగిళ్ళలోకీ వెలుగు వచ్చి, చీకటి తెరల్ని చీల్చింది. పార్వతి ఇంటిముందు కూడా వెలుగు వచ్చింది కాని, ఆ ఇంట్లో అందరి మనసుల్లోనూ ముసురుకున్న చీకటి కరగలేదు. అది మరింతగా కరుడు కట్టుకుపోయింది.

పార్వతికి మెలకువ వచ్చింది. కానీ లేవలేదు. లేచి తనేం చెయ్యాలి ? అందర్నీ చూడాలంటే, వారికి తను కనిపించాలంటే భయంగా వుంది.

" అదేంటమ్మగారూ, నేలమీద పడుకున్నారూ " అంటూ బుగ్గలు నొక్కుకుని, మూలనున్న చీపురు తీసుకుని వెళ్ళిపోయింది పనిమనిషి. పార్వతి మళ్ళీ ఆలోచనల్లో పడింది. " తనింకా ఇలాగే పడుకుంటే గొడవ మరింత పెరుగుతుంది. అందరికీ, చుట్టుపక్కల వాళ్ళకి అనుమానం. తను లేచి నలుగురిలో పడాలి —అమ్మకోసం, అమ్మమ్మకోసం — మావయ్య పరువుకోసం—తనకోసం—

" మావయ్యకి తనమీద పీకదాకా కోపం, అసహ్యం కలిగాయి. నిజమే మరి ! తనెందుకలా పిచ్చిదానిలా అయిపోయింది ? ఇల్లూ, వాకిలీ, వంశ మర్యాదా, తాళికట్టిన భర్త—ఇవన్నీ అస్తమానూ తను వింటున్నా, ఆ క్షణంలో అవేం తనకి గుర్తుకు రాలేదు. దాని ఫలితం తను అనుభవించక తప్పదు...."

పార్వతి ఎక్కువ చదువుకోకపోయినా బాగా ఆలోచించగలదు. ఉన్న వయసుకి మనస్సూ, ఆలోచనలూ ఎక్కువగా ఎదిగిన ఆడపిల్ల పార్వతి. ఆమె ఇంకా పసిగుడ్డు అని సుభద్రమ్మ అనుకుంటే అది పొరపాటే. పార్వతి చుట్టూ ఒక రంగుల ప్రపంచం అల్లుకుని వుంది. అందులో ఆమె విహరిస్తూనే వుంటుంది.

పార్వతి లేచి ముఖం కడుక్కుని తలనిండా స్నానంచేసి ఉతికిన బట్టలు కట్టుకుంది. అప్పటికే సుభద్రమ్మ లేచి చాలాసేపైంది. పాలు తీయించి పొయ్యిమీద పడేసింది. దేవుడిముందు దీపాలు వెలుగుతున్నాయి. మందారాలు, పారిజాతాలు ఆ దీపాల కాంతిలో పగడాలు, ముత్యాలు కలిపి రాశిపోసినట్లు మెరుస్తున్నాయి. పార్వతి దేవుడి దగ్గరికి వెళ్ళి రెండు చేతులూ జోడించింది.

కూతురు దేవుడి ముందు నిలబడి వుండగా చూసిన సుభద్రమ్మ గుండె తరుక్కుపోయింది. "పార్వతివల్ల తప్పు జరిగిపోయింది. ఆ తప్పు దేవుడు క్షమించినా, పక్కనున్న మనుషులు క్షమించరు. ముఖ్యంగా దాని మొగుడు క్షమించడు" అని ఆ తల్లి కుమిలిపోయింది.

పార్వతి నెమ్మదిగా తులసికోట దగ్గరకి చేరి కూర్చుని శూన్యంలోకి చూస్తోంది. ఆలోచించటానికేమీ లేదు. క్రమ క్రమంగా తను చేసిన అపరాధానికి పశ్చాత్తాపపడుతోంది—'తను ఎందుకిలా అయిపోయింది?' తడిబట్టని మెలిపెట్టి పిండినట్లుగా మనసుని పిండుతున్నట్లు బాధ. "ఎందుకీ బాధ? పాపరాజుతో వెళ్ళిపోయినందుకా!! వెళ్ళిపోయి పట్టుబడిపోయినందుకా?!" ఏదీ చెప్పలేని కలగాపులగపు అవస్థ అది.

*

చిట్టిబాబు వంటరిగా పడుకుని కుతకుతలాడిపోతున్నాడు. "సరిగ్గా పోయిన వారం ఇదే రోజున తన జీవితంలో అశాంతి ప్రవేశించింది."

అతనికి ఆడజాతిమీదే అసహ్యం వేస్తోంది. అతనెప్పుడూ పార్వతి గురించి పెద్దగా పట్టించుకోకపోయినా, ఆలోచించకపోయినా ఆమె చేసిన పని అతనికి గొడ్డలిపెట్టయింది. అతనికి ఆడదాని స్వేచ్ఛ గురించి కొన్ని దృఢమైన అభిప్రాయాలున్నాయి. అవన్నీ ఇప్పుడు తారుమారయ్యాయి. అసలు స్త్రీ ఎప్పుడూ ఒక తెరచాటున వుండాలి. కోర్కెలు, స్వేచ్ఛా, సరదాలులాంటి వాటికి చాలా దూరంగా స్త్రీని వుంచాలి అని ఈనాడు అనిపిస్తోంది.

' ఈ జన్మలో తను పార్వతిని స్వీకరించలేడు. ఒక పనిమనిషిలా ఇంట్లో పడివుంటుంది. గుప్పెడు మెతుకులు పడేస్తాడు. తన భార్య ఎక్కడికో లేచిపోయిందనే అపఖ్యాతి తనకి రాకుండా దాన్ని ఇంట్లో ఒక గొడ్డులా కట్టిపడేస్తాడు—అంతే—ఛీ ! తను ఎంగిలికూడు తినేంతటి నీచుడు కాడు. అంటకుండలాంటిదాన్ని తాకితే తనూ మైలపడిపోతాడు—అందుకే... అందుకే '—చిట్టిబాబు కసితీరా ఆలోచిస్తున్నాడు.

" ఒరే చిట్టీ భోజనానికి లేవరా " అన్న అక్కయ్య పిలుపుతో మళ్ళీ మామూలు లోకంలోకి వచ్చాడు.

దూరంగా పెరటిపైపు చిన్న ఇంట్లో గుమ్మంలో కూర్చుని వుంది పార్వతి. ఆమె అలా బయటపేరటంవల్ల సుభద్రమ్మ హుషారుగా వుంది. జరిగిందేదో జరిగిందిగానీ దాని తాలూకు పాపం తమని చుట్టుకో లేదని తెరిపిగా వుంది. ' ఈ వారంనాళ్ళూ తను కుళ్ళిపోయింది. ఈరోజుతో ఆ శంక తీరిపోయింది. మళ్ళీ తమ్ముడ్ని బతిమాలి, నచ్చచెప్పాలి. '

చిట్టిబాబు కాళ్ళు కడుక్కొని వచ్చి కంచంముందు కూర్చున్నాడు. సుభద్రమ్మ తమ్ముడి కిష్టమని అనపకాయ అవపెట్టి కూర చేసింది. దోసకాయపప్పు, కొబ్బరి పెరుగుపచ్చడి చేసింది. పప్పులోకి వడియాలు, మజ్జిగ మిరపకాయలు వేయించింది.

చిట్టిబాబు నిశ్శబ్దంగా భోజనం చేస్తున్నాడు. మరో సమయం అయితే అక్కగారి వంటలో అద్భుతాలు వర్ణిస్తూ, ఆప్యాయంగా తినేవాడు. ఈమధ్య మౌనిలా పనికానిస్తున్నాడు. ఆ వాతావరణం సుభద్రమ్మకి భయంగానూ, అస్తిమితంగానూ వుంది. లేని ధైర్యం తెచ్చుకుని నెమ్మదిగా విషయం కదిపింది.

చిట్టిబాబు కనుబొమలు ముడిపడ్డాయి. ముఖం చిట్లించాడు.

"దాని పేరూ, దాని విషయం మరెప్పుడూ నా దగ్గర ఎత్తకు. నీ ముఖం చూసి, దాన్ని ఇంట్లో వుండనిస్తున్నాను. లేకపోతే ఏనాడో తన్ని తగలేసేవాణ్ణి" అన్నాడు కోపంగా.

సుభద్రమ్మేం మాట్లాడలేదు. ఏమి మాట్లాడేందుకూ ఆమె దగ్గర మాత్రం ఏముంది ?

తన కన్నకూతురని అనుకోవడంగానీ, నిజానికి చిట్టిబాబు చెప్పిన దాంట్లో తప్పేమీ లేదనిపించింది సుభద్రమ్మకి. 'వాడికేం మగ మహారాజు. ఆడది అణిగి మణిగి వుండాలిగాని బరితెగిస్తే ఏ మొగుడూరు కుంటాడు ? ఇంకా వీడు మంచివాడు కనుక ఇంట్లో గుప్పెడు మెతుకులు తిని వుండనిస్తున్నాడు. లేకపోతే దీని గతి కుక్కలకీ, నక్కలకీను—ఎంతో కష్టపడి కళ్ళల్లో వొత్తులు వేసుకుని దీన్ని పెంచుకొస్తే ఇది తలవంపులు తెచ్చింది, అంతా—నా ఖర్మ, అనుకుని నిట్టూర్చింది. ఆ తర్వాత మళ్ళీ ఆ ప్రస్తావన తేవడానికి భయపడింది.

*

దమయంతి విసురుగా బీరువాలోంచి బట్టలుతీసి పెట్టెలో కుక్కడం మొదలుపెట్టింది. కోపంతో, కసితో ఆమె ఊగిపోతోంది. 'అన్నీ వున్నాయి నీకేమిటి లోటు—అని అంటారందరూ. నిజానికి తనూ ఇంతవరకూ అలాగే అనుకుంది. కానీ ఈ ప్రేమలు, యిష్టాలు మగవాళ్ళకి

క్షణ క్షణం మారుతుంటాయని ఇప్పుడే తెలిసింది. ఏమైనా అంటే మగ మహారాజు అంటూ అదో గొప్ప విషయంగా భావిస్తారు ఆడవాళ్ళు సహితం. మగాడైతే—తప్పు తప్పు కాదా! '

దమయంతి దభీమని పెట్టె మూసింది. అక్కడేవున్న విశ్వం నిర్లక్ష్యంగా ఆమెకేసి చూశాడు. ఆమె అంతకంటె నిరసనగా చూసి, పర్సులో డబ్బులొకసారి చూసుకుని చెప్పుల్లో కాళ్ళు దూర్చింది.

" ఇదిగో ఆఖరిసారి చెప్తున్నా! జరిగిందేదో జరిగింది. ఆడదానివి నువ్వు అడుగు బయటకేస్తే ఏమైపోతావో ఆలోచించుకో. మళ్ళీ ఈ గడపతొక్కే అవకాశం మాత్రం రాదు. గుర్తుంచుకో " అన్నాడు బెదిరింపుగా.

" మీరు నా కాళ్ళు పట్టుకున్నా మీ గడప తొక్కను. నేనేం గతిలేకుండా లేను. మీరు పెట్టే గుప్పెడు మెతుకులు ఆశించాల్సిన స్థితి లేదు " అంది దమయంతి ధైర్యంగా.

" అవును! నాకా విషయం తెలుసు. మీ నాన్న ఇచ్చిన డబ్బు నీ పేరునే వుందని కూడా తెలుసు. ఇంక నీకు భయం, భక్తీ ఎందుకుంటాయి? వీడు కాకపోతే మరొడూ " అన్నాడు కసిగా.

" ఛీ! ఆ మాట అనటానికి సిగ్గుపడాలి. ఈనాడు నేను నా జీవితంలో నిప్పులు పోసుకుని వెళ్ళిపోతున్నానంటే దానికి మీ నడతే కారణం — నేను మాత్రం కాదు. మీరు పశ్చాత్తాపపడేరోజు రాకపోదు. " విసురుగా తలుపు మూసి బయటికెళ్ళిపోయింది దమయంతి.

విశ్వం గుండెలో సన్నని మంట బయలుదేరింది. తప్పు ఒప్పుకోవడానికి మగతనం అడ్డు వస్తోంది. ' అసలు ఈ మగతనమే తన చేత తప్పుదారి పట్టించింది.

తనకి దమయంతంటే ప్రాణం. ఆమెని ప్రేమించాడు. ఆమె కూడా తనతోటిదే లోకంగా వుంది. తనకెంతో సుఖాన్ని పంచి ఇచ్చింది. అయితే తను పొగరుతో తప్పు చేశాడు. తొందర పడటం, దమయంతికి పట్టుబడటం ఒకేసారి జరిగిపోయాయి. తను తన భార్య దమయంతి కాళ్ళు పట్టుకోలేకపోయాడు. 'చేస్తే చేస్తాను నేను మగాడిని' అనిపించింది. దాని పర్యవసానం దమయంతి తనని వదలి పుట్టింటికి వెళ్ళిపోయింది.

అయితే దమయంతి శాశ్వతంగా తనని వదలి వుండగలదా! వుండలేదు. ఏదో ఒకనాటికి వస్తుంది. కాళ్ళు పట్టుకుంటుంది. అప్పుడు చూపిస్తాను నా తడాఖా. మొగుడంటే ఏమనుకుంటోందో!

'సుకన్య తన బ్రతుకులోకి అడుగు పెట్టిన క్షణం నుంచీ తనలో తను అశాంతి అనుభవిస్తూనేవున్నాడు. ఈ నాటితో తన అశాంతి బ్రద్దలై దమయంతిని దహిస్తోంది.

నిష్కర్షగా ఆలోచిస్తే దమయంతి ముందు సుకన్య దిగదుడుపే. కాని ఎందుకో తను తిప్పుకోలేని ఆకర్షణ సుకన్యలో వుంది. తనా విధంగా అయిపోవడానికి సుకన్య ప్రోత్సాహం లేదనడానికి వీల్లేదు. తనకి పెళ్ళయిందని తెలిసీ, తనతో పరిచయం పెంచుకుంది. ఆడదే చేయిచాచి ముందుకొస్తే తను వెనుకడుగు వెయ్యటం తన మగతనానికే అవమానం అనిపించింది. కాని ఈ వ్యవహారంవల్ల నిజంగా నష్టపోయింది తనే. సుకన్య కానేకాదు. ఆమెకి పెళ్ళికాలేదు. ఆమె ఎవ్వరినీ బాధించాల్సిన పనిలేదు. అందుకే తను గిజగిజ కొట్టుకున్నాడు. తనకి సుకన్యమీద ఎంత వ్యామోహం, యిష్టం వున్నా, దమయంతిని వదులుకునే శక్తి మాత్రం లేదు. తన భార్య అని గర్వపడటం కాకపోయినా వ్యక్తిగా దమయంతిలో గొప్పగుణాలున్నాయి. ఆమె అమృత హృదయం నిండా ఈనాడు హాలాహలం సలసల మరుగుతోంది. దీనికంతటికీ కారణం తనే. తనేంచెయ్యాలి? అంతులేని ఈ బాధ నుంచి విముక్తి ఎలా పొందాలి....'

విశ్వం విషాదంగా కూర్చున్నాడు. అంతూ పంతూ లేని ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కిపోతోంది —

' దమయంతి వెనకాలే తను వెళ్ళినా ఆమె విదిలించికొడుతుంది గాని రాదు. ఆమె కాస్త శాంతపడ్డాక తనేం చేసినా చెయ్యాలి ; ఆమె గడప దాటుతుంటే తను మరీ పొగరుగా పట్లాడాడు. మగవాడనే గర్వాన్ని ప్రదర్శించాడు. దాని ప్రభావం దమయంతిమీద ఎంతైనా వుంటుంది. ఆమె అభిమానవతి. ఏదైనా భరిస్తుందిగాని అలాంటి అవాకులు, చవాకులు భరించదు '

విశ్వానికి ఆలోచన తెగడంలేదు. విసుగ్గా లేచి షర్టు వేసుకుని వీధినపడ్డాడు.

ఒక్కొక్క క్షణం అతని మనసు భయంతో విలవిల్లాడిపోతోంది. దమయంతి వ్రదేకంతో ఏమైనా అఘాయిత్యం చేస్తుందేమోనని — కాని వెంటనే అతనికి ఆమె వ్యక్తిత్వం స్ఫురించి వూరట కలుగుతోంది. ' దమయంతి ఓటమిని అంగీకరించి, బేలగా ఎప్పటికీ అవదు. పైగా ఆమె తండ్రి ఆమెని ఆదరిస్తాడు ఆమెని ప్రశ్నలతో విసిగించడు. బుజ్జగించి, అన్నీ అడిగి తెలుసుకుంటాడు. ఆమె కష్టపడితే అయన చూడలేడు. ఆమెకి ఊరట కలుగుతుంది. నిరాశ చెందాల్సిన పనిలేదు. ఏదో అయిపోవాల్సిన అవసరమూ లేదు — తనే ఎవ్వరికీ చెప్పుకోలేని బాధతో విలవిల్లాడిపోతున్నాడు '

విశ్వం రోడ్లన్నీ తిరిగాడు. ఒకచోట అని నిర్ణయం లేకపోవడంతో గమ్యం తెలీక మరీ తిరిగాడు. రెండు మూడుసార్లు సుకన్య యింటికి వెళదామనుకుని కూడా మానుకున్నాడు. కాళ్ళు నొప్పులు పట్టి, ఎదురుగా కనిపించిన సినిమా హాల్లో టికెట్ తీసుకుని లోపలికివెళ్ళి కూర్చున్నాడు.

*

పరాశరుడుగారు ఆవూరి కరణం. ఊరికి కరణంగానే కాకుండా అందరికీ పెద్దదిక్కు. అందరి క్షేమం కోరే సంస్కారవంతుడు. దయా

గుణం కలవాడు. అందుకే ఆయనంటే వూళ్ళో అందరికీ ఎక్కడలేని గౌరవం. పరాశరుడుగారు చదువూ, సంస్కారం కలవాడు. పైగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశంకోసం పోరాడిన త్యాగి. అందరినీ సమదృష్టితో చూసే సాత్వికుడు. ఆయన ఏకైక కుమార్తె దమయంతి. ఆయన ఆమెని ఆడపిల్ల అనే దృష్టితో ఎప్పుడూ చూడలేదు. చక్కగా చదివించారు. ఊళ్ళోలేని చదువు పట్నం పంపించి చెప్పించారు, స్వతంత్ర భావాలు గల ఆదర్శ యువతిగా తీర్చిదిద్దారు.

ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా వుండే ఆయన ఆరోజు స్తబ్దుగా వున్నారు. ఎటూ తేల్చుకోలేని ఆలోచనలతో సతమతమవుతున్నట్లుగా వున్నారు.

దమయంతి వచ్చి నాలుగురోజులైంది. వచ్చిన రెండురోజులు పెద్దగా పట్టించుకోలేదు. నిన్నటి రోజున ఆయనకి అనుమానం వచ్చింది. దమయంతి విడిగా రావటమే అరుదు. ఒకవేళ ఎప్పుడైనా వచ్చినా వెనకాలే విశ్వం వచ్చేసేవాడు. అలాంటిది ఈసారి నాలుగు రోజులైనా అతను రాలేదు. దమయంతి కూడా హుషారుగా కనిపించటంలేదు. తల్లిలేని పిల్లని తనే అన్నీ అయి పెంచాడు. ఈ రోజు ఆమె వంటరితనంతో బాధ పడుతున్నట్లు అనిపిస్తోంది. అయినా తను ఆమెనెలా అడగాలో తెలీక తికమక పడుతున్నాడు.

దమయంతికి తండ్రి దగ్గర ఎంతో చనువుంది. తనకేం కావలసినా నిర్భయంగా అడగగలదు. ఆమెకి గుర్తెరిగినప్పటినుంచి తండ్రే గాని తల్లి నెరగదు. ఇంట్లో మేనత్త అన్నీ చేసినా ఎప్పుడూ తండ్రితోనే వుండేది. అలాంటి దమయంతి తనంతట తాను ఏమీ చెప్పకపోవడంతో ఆ తండ్రికి మరింత బాధగా వుంది.

"సుబ్బన్నా ! అమ్మాయి వుంది లోపల. పిలుస్తున్నానని చెప్పు" అని కేక వేశారు పరాశరుడుగారు. సుబ్బన్న వచ్చేలోగా పక్కగదిలోంచి దమయంతి వచ్చింది.

" ఏం నాన్నా పిలిచావు " అంటూ. ఆయన ఒక్కసారి కూతుర్ని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశారు. ఆ విషయం ఆమె గమనించకుండా.

" కాలువ గట్టుకి చల్లగాలికి పోదాం రా తల్లీ " అన్నారు.

" అలాగే నాన్నా. ఒక్కక్షణంలో వస్తాను " అంటూ ఆమె లోపలికెళ్ళింది. ఆ మాత్రమైనా ఉత్సాహంగా వున్నందుకు ఆయన ఆనందించారు.

పచ్చటి చేల మధ్యలోంచి నిండుగా ప్రవహిస్తున్న కాలువ. చల్లటిగాలి నీటి మీంచి వచ్చి, మనసుని, శరీరాన్ని తేలికపరుస్తోంది.

పరాశరుడుగారు ఎప్పుడూ కూతుర్ని దయా అని పిలుస్తారు. ఆ పిల్ల పేరు దమయంతి అయినా ఆయన భగవంతుడు తన మీద చూపించిన దయ అంటారాయన.

" అమ్మా దయా ! ఏమిటీ చాల నిరుత్సాహంగా వున్నావ్ " అన్నారాయన.

" ఏం లేదు నాన్నా – నీకెందుకలా అనిపించింది " అంది నవ్వుతూ.

" నువ్వు వచ్చిన మర్నాటి నుంచి వెళతానంటూ బయలుదేరేదానివి. ఈసారి ఆ మాటే లేకుండా నిశ్చింతగా వుంటేనూ .... "

" ఓ .... అదా సంగతి " అంటూ మరీ తేలిగ్గా నవ్వింది.

" విశ్వం కులాసాగా వున్నాడా " అన్నారాయన ఆమె ముఖ కవళికలు చదవాలని ప్రయత్నిస్తూ.

" బాగానే వున్నారు " అంది. ఆమె ఎంత ప్రయత్నించినా దాగని కొన్ని భావాలు ఆయన అరవై ఏళ్ళ అనుభవం చదవనే చదివించి. ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలీలేదు ఆయనకి. తండ్రి తన గురించి ఏదో మధనపడుతున్నాడని మాత్రం దమయంతి గ్రహించింది.

" నాన్నా. నువ్వు నా గురించేం బెంగ పెట్టుకోవద్దు. నేను మీకు కష్టం కలిగించే పని, మీకు పరువు నష్టం కలిగించే పని ఏదీ చెయ్యను. అయితే నాకిప్పుడు కొంత అశాంతిగా, చిరాకుగా వుంది. అందుకే కొన్నాళ్ళు మీ దగ్గర శాంతిగా వుందామని వచ్చాను " అని, కాసేపాగి " నాకు మీకంటే ఎవ్వరూ లేరుకదా " అంది. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఏర్పడిన నీటిపొర చూసి పరాశరుడుగారు చలించిపోయారు.

" నీ ఇష్టం వచ్చినంతకాలం వుండు తల్లీ నాకే బాధ లేదు. నీ సుఖం తోటే నా పరువు, ప్రతిష్ఠ వుంటాయి. నువ్వు ఏ మాత్రం కష్టపడుతున్నా నాకు లభించే పరువు ప్రతిష్టలు నాకు వద్దు " అన్నారాయన.

" నాకు నీ మనసు తెలుసు నాన్నా " అంది. ఆ పైన ఆమెకి పెద్దగా మాటలు దొరకలేదు. గుంపులుగా పక్షులు ఎగిరి గూటికి పరుగులు పెడుతున్నాయి. ఒకరిద్దరు దారిలో కనిపించి అయ్యగారికి దండాలు పెట్టి అమ్మాయిగారి క్షేమసమాచారాలు అడిగి కదిలారు - దమయంతి ఆకాశంలో పక్షుల్ని, మబ్బుల్ని చూస్తూ కబుర్లు చెప్తూ నడుస్తోంది. కూతురి మనసులో వున్న బాధ ఒక్కసారిగా కరిగేది కాదని, క్రమంగా ఆమె చెప్తుందనీ. అంతవరకు తను ఓపికగా వేచి వుండాలని ఆయన అనుకుని ఊరట పొందారు.

*

గేటు తీసి లోపలికి అడుగు పెట్టబోయిన విశ్వం గతుక్కుమని ఆగిపోయాడు. వరండాలో పడక్కుర్చీలో బొద్దుగా, నల్లగా వున్న గుబురు మీసాల ఆసామిని చూసి తడబడ్డాడు. అయితే వచ్చినవాడు వచ్చినట్లు వెనక్కి తిరిగిపోతే బాగుండదని నెమ్మదిగా అడుగులు వేశాడు. అతని గుండెలు దడదడలాడుతున్నాయి. ఆయన ఎవరై వుంటాడు. తననేమైనా అడిగితే ఏం సమాధానం చెప్పాలి. అని తీవ్రంగా ఆలోచిస్తూనే, సుకన్య రాత్రికి రాత్రి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోలేదు కదా అని సంశయిస్తూ

నెమ్మదిగా అడుగులు వేస్తున్నాడు. ఇంతలో ఆ కుర్చీలో పెద్దమనిషి తలెత్తి విశ్వాన్ని చూడటం, సుకన్య తెర తొలగించుకుంటూ రావడం ఒకేసారి జరిగాయి. భయం, ఆనందం విశ్వాన్ని కలగాపులగంగా ఒకేసారి కలవరపెట్టాయి.

సుకన్య మామూలుగానే ఆహ్వానించింది. విశ్వానికి వొళ్ళు మండిపోయింది. ఎవరా మనిషని పెర్రెత్తిపోయింది. సుకన్య ఇదేం గమనించకుండా " రండి - అలా నిలబడిపోయారేం - ఈయన మా నాన్న " అంటూ వయ్యారంగా పరిచయం చేసింది.

విశ్వం చేతులు జోడించాడు అసంకల్పితంగా.

" రండి ఇలా కూర్చోండి " అన్నారాయన. విశ్వం పిల్లిలా ముడుచుకుని కూర్చున్నాడు. జడ్జి ముందు బోనులో నిలబడిన దొంగలా అతను భయం భయంగా చూస్తున్నాడేగాని ధైర్యంగా కళ్ళెత్తి చూడలేక పోతున్నాడు.

" మీ పేరు ? "

" విశ్వనాధరావు " అన్నాడు విశ్వం,

" నా పేరు రాఘవేంద్ర. నేను మిలటరీ డాక్టరుగా ఎక్కడెక్కడో వుంటూ వచ్చాను "

" అలాగా. మీ గురించి సుకన్య చెప్తూ వుంటుంది " అన్నాడు విశ్వం. అతని గొంతు తడారిపోయింది. నిజానికి సుకన్య ఎప్పుడూ పెద్దగా తండ్రి గురించి చెప్పనేలేదు.

" అయితే నా కన్నకూతుర్ని ఎందుకంత దూరంగా వుంచుకున్నానో ఆలోచిస్తే బాధతో ఈ మనసు మెలికలు తిరిగిపోతోంది.

" ఆమె నా దగ్గరే వుంటే బాగుండునని ఎప్పుడైనా అనిపించినా, అందుకు నా స్వేచ్ఛా, నా సుఖం అడ్డు వచ్చేవి తటస్థంగా వూరుకునే వాడిని. డబ్బు పుష్కలంగా పంపేవాణ్ణి. నేనెప్పుడూ నా కూతురియందు ప్రేమ కనబరచలేదు. తనకోసం నాన్న వున్నాడనే భావం కలిగించ లేదు. అయినా నన్ను తల్చుకుందంటే గొప్ప విషయమే - - " ఆయన ఊపిరి పీల్చుకున్నాడు.

అక్కడే కూర్చున్న సుకన్య గోళ్ళరంగు చూసుకుంటూ కూర్చుంది.

" ఇదిగో విశ్వం—ఇంతకీ నేను చెప్పబోయేది జాగ్రత్తగా విను. మా సుకన్యకీ నీకూ ఎలాంటి అనుబంధం ఏర్పడిందో నాకు అర్థమైంది. కాని అది కొనసాగటానికి వీల్లేదు. మీ ఇద్దరికీ ఒకరిమీద మరొకరికి ప్రేమ కలిగితే కలిగుంటుంది. కాని అది శాశ్వతంగా వుండటానికి పరిస్థితులు అనుకూలించవు. కారణం — నీకు ఇంతకుముందే పెళ్ళయింది. ఈ సంబంధంవల్ల నీ భార్యని నువ్వు వదిలేద్దామనుకున్నా నే నొప్పుకోను. నిన్నటివరకు ఏమోగాని, ఈరోజు సుకన్య కూడా అంగీకరించదు. నా మిత్రుడు ఆమెని పెళ్ళిచేసుకుంటాడు. మా ఇద్దరికీ వయసులో చాలా తేడా వుంది. అతను ఆమె గతాన్ని మన్నించి, భవిష్యత్తుని మాత్రమే స్వీకరిస్తాడు. ఆమె సుస్థిరమైన సుఖశాంతులతో సంసారం చెయ్యాలని నా కోరిక.

నేను కట్టుకున్న భార్యకి ఎంతో ద్రోహం చేశాను. నా కూతురుచేత కూడా అదేవిధంగా మరో స్త్రీకి ద్రోహం చేయించను. ఇంతకీ నేను చెప్పిన విషయాలకి సుకన్య అంగీకరించింది కనుక, అర్థంచేసుకుంది కనుక, సుకన్య అనుమతితోనే ఇవన్నీ మాట్లాడుతున్నాను. వారం పదిరోజుల్లో సుకన్యని తీసుకెళ్ళిపోతున్నాను" అంటూ ఆయన కుర్చీలోంచి లేచి " సుకన్యా, ఆయనతో నువ్వేమైనా మాట్లాడాలనుకుంటే మాట్లాడు " అంటూ లోపలికెళ్ళిపోయాడు.

విశ్వం బుర్ర గందరగోళంగా అయిపోయింది. ' తను ఏమనుకున్నాడు ? ఇప్పుడేం జరుగుతోంది ? అయితే సుకన్య తనతో తెగతెంపులు చేసుకునేందుకు ఒక్క రాత్రిలో నిర్ణయం తీసుకుందన్నమాట ! తనే వట్టి మూర్ఖుడు. ఇన్నేళ్ళు కలిసి బ్రతికిన దమయంతితో జీవితాన్ని తనెంత త్వరగా తుంచేశాడు ! అంతకంటె సుకన్య తనని ఎక్కువగా ఎందుకు చూస్తుంది .... ?

అంతవరకు రంభలా కనిపించిన సుకన్య అతని కళ్ళకి ఆ క్షణంలో రాక్షసిలా కనిపించింది. ఆమె కళ్ళు చిరుతపులి కళ్ళలా అనిపించాయి. ఆమె మీద ఎక్కడలేని ద్వేషం పొంగింది. ఆ భావం అతని ముఖంలో సుకన్యకి తెలుస్తూనే వుంది.

" మనం ఇలాగే విడిపోవడం మంచిది " అంది నెమ్మదిగా -

" చాలా థాంక్స్. మరింక వుంటా " అంటూ చర్రున లేచాడు. విసురుగా కదిలాడు. అతనలా వెళ్తున్నందుకు సుకన్య సునుపటిలా చలించిపోలేదు.

" మంచిది " అంది. అతను చకచక ముందుకు కదిలాడు.

*

పార్వతి మల్లెచెట్టు ఆకులన్నీ దూసి, బోదెవేసి నీళ్ళు పోస్తోంది. నూతి దగ్గరనుంచి బోదె చేసుకుంటూ వచ్చి మల్లెచెట్టు మొదట్లోకి కలిపింది. ' ఈ మల్లెపందిరినిండా పూలు విరగబూస్తాయి. అవన్నీ తనేం చెయ్యాలి ? ఇదేం పిచ్చి ప్రశ్న ! తను కాసిన్ని పెట్టుకుంటుంది, ఎవరికైనా యిస్తుంది .... '

పార్వతి ఏ విషయం గురించి ఆలోచన మొదలుపెట్టినా అది చిట్ట చివరికి ఆగటం ఒకేచోట - అలా మల్లెపూల దగ్గర మొదలైన ఆలోచన

తన జీవితం మలుపు తిరిగిన రోజుకొచ్చి ఆగిపోయింది. భయంతో వొణికిపోయింది. మల్లెచెట్టు మంటల్లో కాలిపోతున్నట్లు కదిలిపోయింది. అశాంతితో విలవిల్లాడిపోయింది.

తనెంత తెలివితక్కువగా అజ్ఞానంతో కాలుజారిందో ఆమెకి అనుక్షణం గుర్తుకొస్తూనే వుంది. ఆనాటి నుంచీ చిట్టిబాబు ఆమె వంక కన్నెత్తి చూడలేదు, పల్లెత్తి మాట్లాడలేదు. రాత్రి నిద్ర పోతుంది, రెండు పూటలా అన్నం తింటుంది, పెరట్లో అటూ యిటూ తిరుగుతుంది. అలసటొస్తే ఏ మూలో పడుకుంటుంది. ఏం చేస్తున్నా ఆమె ఆలోచనలు ఆమెని విడవ్వు. బరువైన ఆవేదనల మూట ఆమె వీపుకి కట్టుకొని మోస్తూనే వుంటుంది.

ఇన్నాళ్ళు గడిచిపోయాయి. తను చేసింది ఎంతటి తప్పో, దానివల్ల తన బ్రతుకు ఎలా బండబారిపోయిందో ఆమెకి బాగా అర్థమవుతోంది. మావయ్య పెదవి విప్పి ఒక్కమాట అనకపోయినా అతని మౌనమే ఆమెకి రంపపుకోతగా వుంది. ఉండీ ఉండీ తల్లి శూలంలాంటి మాటొకటి విడుస్తుంటే విలవిల్లాడిపోతోంది. అంతలోనే ఆ తల్లి బాధ అర్థం చేసుకుని తన బాధని దిగమింగుతోంది.

పార్వతి మట్టి చేతులు బక్కెట్టులో ముంచి కడుక్కుంటోంది.

బయట తల్లి గొంతు వినిపించి నూతిచప్టామీదనుంచి సూటిగా కనిపించే వీథి గుమ్మంవైపు చూసింది. దమయంతి నవ్వుతూ వస్తోంది. పార్వతికి ఎక్కడలేని హుషారు వచ్చింది.

"రావమ్మా దమయంతీ, ఎప్పుడొచ్చావు? మీ ఆయన బాగున్నాడా?" అంటూ ఆహ్వానించింది సుభద్రమ్మ. పార్వతి హడావిడిగా చేతులు తుడుచుకుంటూ పరుగు తీసింది.

"పార్వతీ" అంటూ సుభద్రమ్మ పిలవనే పిలిచింది.

" ఏమే పారూ ఎలా వున్నావు " అంటూ చేతుల్లో చేతులు కలిపింది దమయంతి.

" నాకేం నేను బాగానే వున్నాను. నువ్వేమిటి చిక్కావు " అంది పార్వతి అక్కడే వున్న నవ్వారు మంచం వాలుస్తూ -

" నీళ్లోసుకుందేమో " అంది సుభద్రమ్మ అభిమానంగా.

" రోజూ నీళ్ళోసుకుంటూనే వుంటుందిగా " అంది అందులో అర్థం తెలిసినా, తెలీనట్టు.

" ఏడిశావులే నీ మొహం " అంటూ మందలించింది. మరచెంబుతో మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

దమయంతి కంటె పార్వతి నాలుగేళ్ళు చిన్నదయినా ఇద్దరికీ మంచి స్నేహం. దమయంతి చెప్పే వింత వింత కబుర్లు వింటూ ఆశ్చర్యపోవడం పార్వతికి చిన్నప్పటినుంచి అలవాటు. ఆ వూరు మొత్తంలో వీధిబడిలో వున్న ఇద్దరే ఆడపిల్లలు వీరు. పార్వతి ఒకటిలో, దమయంతి మూడులో వుండేవాళ్ళు. కరణంగారి అమ్మాయిగా దమయంతి దర్జాగా వుండి, తనతోబాటు అన్నీ పార్వతికి కూడా జరిపించేది. ఏడోక్లాసు చదివి పార్వతి మానేసింది. అప్పటికే దమయంతి పొరుగూరు వెళ్ళి చదవటం మొదలుపెట్టేసింది. అయినా వాళ్ళిద్దరిమధ్య స్నేహం ఒక్కలాగే వుండిపోయింది.

దమయంతి అందరితోనూ చనువుగా కలిసిమెలిసి వుంటుంది. చదువుకున్న అమ్మాయిని అనే దర్పం చూపించదని సుభద్రమ్మ వాళ్ళూ దమయంతంటే ఎంతో అభిమానిస్తారు.

పార్వతి, దమయంతి కబుర్లలో పడిపోయారు. ఇంట్లో పాడిఆవు దగ్గరనుంచి గాలివానకి పడిపోయిన కరివేపాకుచెట్టు వరకు పాఠశాల కొత్త భవనం దగ్గర నుంచి పంటచేలలో ఎలుకల వరకు ఒకటేమిటి - ఏది గుర్తుకొస్తే అదే, ఎన్నో మాట్లాడేసుకున్నారు.

పార్వతి దమయంతి భర్త గురించి అడగటానికి మొహమాటపడింది. దమయంతి మాత్రం " మీ మావయ్యేం చేస్తున్నాడు " అంది. " ఏమీ లేదు " అంది పార్వతి తలొంచుకుని.

" అస్సలు ఏమీ లేదా " అంటూ వేళాకోళంగా వీపుమీద చరిచింది

ఇంతలో సుభద్రమ్మ వచ్చి " ఇక్కడే వ్యవసాయం చూసు కుంటున్నాడు " అంది.

" మంచిదత్తయ్యా. ఎందుకా పట్నాలకి ఉద్యోగాల కోసం పోవడం ! హాయిగా ఇంత వుంది కదా ! ఎందుకు లేనిపోని బాధ " అంది.

సుభద్రమ్మ నవ్వి వూరుకుంది.

దమయంతి మాట్లాడుతూనే పార్వతిని పరీక్షగా చూస్తోంది. పార్వతి బాగా పొడుగ్గా ఎదిగింది. నిగనిగలాడుతోంది. బుగ్గలు పాల పూరీల్లా తెల్లగా, మెత్తగా వున్నాయి. ఆరోగ్యంగా, బలంగా కనిపించినా లోతుగా చూస్తే ఆమె కళ్ళల్లో ఏదో వెలితి కనిపించింది. ఆ ఊహకి దమయంతి తనలో తనే నవ్వుకుంది. " అంతా తన భ్రమ కాకపోతే హాయిగా వున్న పార్వతికి వేదనలేమిటి ? తన మనసుని బట్టి ఎదుటివారిని చూడటం పొరబాటు " అని సర్దుకుంది.

నిజానికి ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నట్లు, ఒకరి గురించి ఒకరు చెప్పుకున్నట్లనుకున్నారు గానీ ఇద్దరూ వారిలో వున్న అగాధాలను బయట పెట్టలేదు.

సుభద్రమ్మ వెండి ప్లేటులో పులిహార పెట్టి తెచ్చింది.

" ఇదేమిటత్తా. అప్పుడే ఎక్కడ చేశారు " అంది ఆశ్చర్యంగా దమయంతి.

" ఎంతసేపు కావాలే తల్లీ. నీకిష్టంకదా ని కొంచెం ఆవ కూడా పెట్టాను. అన్నం వుండనే వుంది - తీసుకోమ్మా " అంది సుభద్రమ్మ. ఎప్పటిలాగానే దమయంతి పులిహార బాగుందని మెచ్చుకుంది.

" మీ అత్త కంటె నేను వంటగత్తెనా ఏమిటి? " అని సుభద్రమ్మ వినయం ప్రదర్శించింది.

" మా అత్త బాగానే చేస్తుంది గానీ, వేడిచేస్తుందని ఆవ పెట్టదు " అంది నవ్వుతూ. అందరూ కాస్సేపు రకరకాల వంటల గురించి మాట్లాడు కున్నారు. చీకటిపడే వేళ దమయంతి లేచింది. పార్వతి సంపెంగ చెట్టంతా వెదకి ఒక పువ్వుకోసి దమయంతికిచ్చింది.

గుమ్మందాకా వచ్చి దిగబెట్టింది. గుమ్మంలో సుబ్బన్నని చూసి దమయంతి ఆశ్చర్యపోయింది.

" ఏమిటి సుబ్బన్నా " అంది.

" ఏం లేదమ్మగారూ, మీరొచ్చేది చీకటైతే, సాయంగా వుండి తీసుకురమ్మన్నారయ్యగారు. అందుకని ఇక్కడ కూకున్నా " అన్నాడు సుబ్బన్న. పార్వతీ, దమయంతి నవ్వుకున్నారు.

" ఇంకా వుంటావా " అంది పార్వతి.

" ఆఁ రేపు రా. నేను తాజమహల్ తెరమీద కుట్టాను. చూపిస్తాను" అంది దమయంతి

" వస్తాను " అంది పార్వతి.

దమయంతి ఇల్లు చేరేసరికి చీకటి నలుమూలలా అలుముకుంది. ఇంట్లో అడుగు పెడుతుండగానే మేనత్త మాణిక్యం ఎదురొచ్చి " ఏమే ఇంతసేపు కూర్చున్నావూ " అంటూ దీర్ఘం తీసింది

" అదే అత్తా - పార్వతితో కబుర్లు చెప్తూ కూర్చుండిపోయా " అంది దమయంతి - ఆమె అప్పుడే వంట పూర్తిచేసుకున్నట్లుంది, గోధుమ రంగు పట్టుచీరతో మడితో వుంది. దమయంతికి కొస్త దగ్గరగా వచ్చి, " ఏం చెప్పింది పార్వతి ? " అంది కంఠం బాగా తగ్గించి. దమయంతి ఆశ్చర్యపోయింది, ఆమె కంఠంలోని ధ్వనిలో ఏదో రహస్యం వున్నట్లనిపించి.

" ఏముంది చెప్పటానికి " అంది. మాణిక్యం మూతి మూడు వంకర్లు తిప్పింది.

" అయితే నీకేమీ తెలీదన్నమాట " అంది.

" ఏమిటి తెలిసేది " అని మరింత అయోమయంగా అడిగింది. ఆ అడగడంలో చిత్రమైన ఆసక్తి కూడా ఉంది.

" పార్వతి విషయం నువ్వసలు వినలేదన్నమాట " అంటూ మండువా స్తంభానికి ఆనుకుని చతికిలబడింది. అసలే ఆమె ధోరణికి విసుక్కునే దమయంతికి చిరాకెత్తుకొచ్చింది. దానికి తోడు అసలేం జరిగిందా అనే ఉత్సుకత ఆమెని నిలవనియ్యకుండా చేసింది.

" ఇదిగో అత్తా. చెప్పేది సూటిగా చెప్పు. లేకపోతే మానెయ్ అంతేగానీ తెలీదా, తెలీదా అంటూ నాన్చకు " అంది.

మాణిక్యం దమయంతిని దగ్గరగా వచ్చి కూర్చోమని సైగ చేసింది. ఆమె మంత్రముగ్ధలా మేనత్త దగ్గరగా వచ్చి నేలమీద కూర్చుంది.

" పార్వతి బిచ్చిపాపరాజుతో లేచిపోతేనూ ఎవ్వరికీ తెలీకుండా పట్టుకుని తీసుకొచ్చారు " అంది మాణిక్యం.

ఒక్కసారి పిడుగు పడినట్లు అదిరిపోయింది దమయంతి.

" ఛీ, వెధవ మాటలూ నువ్వూను. ఎందుకత్తా అలాంటి మాట లంటావు ? తప్పుకదూ ! పాపం ఆ పిల్ల ఎంతో మంచిది " అంది.

" ఓయబ్బో నాకు చెప్పకు ! తప్పుడు మాటలు, అబద్ధాలు అంటే తప్పుగానీ, ఇది వున్నమాట కనుక అన్నాను. తప్పులేదు " అంది మాణిక్యం ఖచ్చితంగా. దమయంతి అవాక్కయిపోయింది. ఆమె తేరుకోవటానికి చాలాసేపు పట్టింది. మళ్ళీ మాణిక్యమే కొనసాగించింది.

" ఆ పిల్లాడు వాళ్ళింటి చుట్టూ తిరిగేవాడు. ఆ పెద్ద ముండలిద్దరూ కనిపెట్టలేకపోయారు. ఇద్దరూ బాగా మరిగారులా వుంది ఓ రోజున లేవదీసుకునేపోయాడు. తెల్లారేసరికి చిట్టిబాబు పట్టుకొచ్చి దీన్ని ఇంట్లో పడేశాడు .... వాడ్ని బాగా తన్ని వదిలేశాడు " అంది.

ఈ కథంతా అబద్ధంగా దమయంతి అనుకోలేకపోయింది. ఇందులో కొంత చిలవలు, పలవలు వున్నా, అసలంటూ ఎంతో కొంత జరిగే వుంటుందని నిర్ణయించుకుంది. ఆ ఊహ ఆమె మనసుని చిత్రవధ చేసింది. ' అంతటి తప్పు చేసినా ఆమెనింకా ఇంట్లో పెట్టుకుని ఏలుకుంటున్నాడంటే - ఆ మొగుడు నిజంగా ఎంత ఉత్తముడు! చిట్టిబాబు అంత మంచివాడా ? అంత ఉత్తముడా ? ఏమో ! మామూలుగానే కనిపిస్తాడు. అలాంటివాడు ఇంత సంస్కారవంతంగా వున్నాడంటే ఎంత గొప్ప .... ' దమయంతి మనసు గందరగోళంగా అయిపోయింది. తను ఏ తప్పు చూసి సహించలేక, ఇల్లు వదలి పారిపోయి వచ్చిందో అదే తప్పు ఒక స్త్రీ చేస్తే ఆమెని క్షమించి నిలవ నీడ ఒక మగాడు యిచ్చాడంటే నిజంగా ఇది తిరగబడిన లోకం తీరు అనుకోవాలి. ఆమె మనసు కుతకుతలాడిపోయింది. మేనత్త ఇంకా ఏవో చెప్తూనే వుంది. చివరికి పార్వతి లాంటి పోకిరిపిల్ల మరొకరు వుండరని తేల్చింది. అంతటి మాటని దమయంతి వొప్పుకోకపోయినా మనసులో ముల్లు గుచ్చుకుంది.

మేనత్త మాటలు వింటూనే అలాగే అక్కడే గచ్చుమీద వొరిగింది, అలసటగా కళ్ళు మూసుకుంది. అమాయకంగా పార్వతి ముఖం కనిపిస్తోంది. ఆ అమాయకత్వమంతా పైపైనే అని గుర్తుకొస్తే మనసు రగిలిపోతూంది.

"కింద పడుకున్నావేమిటి దయా" అన్న తండ్రి మాటకి ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

"ఏమిటీ మీ అత్త నూరిపోస్తోంది" అన్నారు పరాశరుడుగారు.

"ఏం లేదు నాన్నా. కాశీమజిలీ కథ చెపుతోంది" అంది. తనని మేనకోడలు కాపాడినందుకు హమ్మయ్య అనుకుంది మాణిక్యం.

దమయంతి రాత్రంతా నిద్రలేకుండా బాధపడింది. ఆలోచనలు ఆమె మెదడును వేడెక్కించి పారేశాయి. తను విన్నదంతా ఉత్త అబద్ధం అని నచ్చచెప్పుకోవటానికి ప్రయత్నం మొదలు పెట్టింది. కాని అది ఆమెకి సాధ్యంకాలేదు. ఎటూ నిర్ణయించుకోవటానికి ఏ ఆధారాలూ దొరకలేదు.

తెల్లవారి లేచేసరికి తలనొప్పి, కళ్ళు మంటలు మొదలయ్యాయి. ఎంత వద్దనుకున్నా అనుక్షణం విశ్వం గుర్తుకొస్తున్నాడు. ఇన్ని రోజులుగా అతని ధ్యాసే వుండకూడదని నిగ్గదీసుకుంది. అలాంటిది రాత్రి నుంచి ఆమె మనసు ఆమె మాట వినడం మానేసింది. పశ్చాత్తాపం ఆమెలో నిముషనిముషానికీ ఎక్కువై పోతోంది. తనెంత తొందర పడిందో తలుచుకుని కుమిలిపోవటం మొదలైంది. అలా అనుకోగానే వెళ్ళిపోదామనే తొందర బయలుదేరింది. సమయం గడవనట్టు చిరాకుగా అనిపిస్తోంది. కానీ వున్నట్టుండి వెళ్ళిపోతానంటే తండ్రి ముందు చిన్నతనంగా వుంటుంది అలా చెయ్యటానికి సిగ్గుగా అనిపిస్తుంది. అసలే విషయం పూర్తిగా చెప్పకుండా ఇప్పుడు అకస్మాత్తుగా వెళతానంటే ఆయనేం బాధ పడతాడో అని కుంచించుకుపోతోంది. అటు ఇటు తిరుగుతూ, ఆలోచిస్తూ, అశాంతిగ

గడుపుతోంది. మనసు మారుమూల పార్వతిని గురించి అనుమానం వేధిస్తోంది. ఇంత జరిగితే తండ్రికెలాగైనా తెలుస్తుంది. ఆయన ద్వారా పార్వతి విషయం తెలుసుకుని నిర్ధారణ చేసుకోవాలని నిర్ణయించు కుంది.

కాఫీ తాగి, పరాశరుడుగారు కుర్చీలో కూర్చుని ఆనాటి పేపరు చూస్తున్నారు. దమయంతి నిశ్శబ్దంగా తనూ వెళ్ళి కుర్చీలో కూర్చుంది. ఎదురుగా వున్న నిన్నటి పేపరు తీసుకుంది. చదివిందే మళ్ళీ అక్కడక్కడ చదువుతూ తండ్రిని ఎలా అడగాలా అని ఒక పక్క ఆలోచిస్తోంది. పరాశరుడుగారు పేపరు టేబిలు మీద పడేస్తూ "అమ్మా దయా అలా వున్నావేం? వంట్లో బాగాలేదా? వెధవ పేపరు నిండా హత్యలూ, ఆత్మహత్యలూ. చదవాలంటే విసుగెత్తిపోతోంది" అన్నారు.

దమయంతి నవ్వింది,

"ఏం చేస్తాం నాన్నా! జీవితం క్లిష్టంగా అయిపోయింది ప్రతి వాళ్ళకీ" అంది.

పరాశరుడుగారు కూతురివంక నిశితంగా చూసి "అలాగే వుంటుంది సర్దుకోవాలి. ప్రతి చిన్నదానికీ ఎదుటివాడ్ని పొడిచేస్తాం లేదా నేనే పొడుచుకుచస్తా అంటే ఎలాగ" అన్నారు.

దమయంతి కాస్సేపు నిశ్శబ్దంగా వుండి "నాన్నా! నిన్నో విషయం అడగాలనుకుంటున్నా" అంది నెమ్మదిగా - ఆయన గంభీరం అయిపోయి "నువ్వేం అడగబోతున్నావో నాకు తెలుసు" అన్నారు.

"అయితే చెప్పండి చూద్దాం" అంది సవాలుగా. "నిన్న మీ అత్త చెప్పిందిగా పార్వతి గురించి" అన్నారు. దమయంతి గతుక్కుమంది. తండ్రి తన మనోభావాలు సులభంగా చదివేస్తున్నారు. అంటే తన మానసిక పరిస్థితి ఈపాటికి అర్థమయ్యేవుంటుంది. బేలగా ఆయనకేసి చూసింది.

అదేం లేదమ్మా లోపలు కాకులు అని ఆయన అంటారని ఎదురు చూసింది. ఆయన రెండు నిముషాలు నిశ్శబ్దంగా ఆకాశం కేసి చూస్తూండి పోయారు. మళ్ళీ మాట్లాడే ధైర్యం లేక కూడా వూరుకుంది. కుర్చీలో అస్థిమితంగా కదిలి ఆయనే,

" ఆడైనా, మగైనా ఒక పనిని చేసేటప్పుడు ఎంతో ఆలోచించాల్సి వుంటుంది. అయితే ఒక వయస్సు ఏదీ ఆలోచించనివ్వదు " అన్నారు ఉపోద్ఘాతంగా.

" అంటే అత్తయ్య చెప్పింది నిజమేనా " అంది హీనస్వరంతో.

" అందులో అబద్ధమేమీ లేదు. ఆ పిల్ల చాలా తొందరపడింది. ఇంకా ఆ మాత్రం నిలబడిందంటే ఆ మొగుడు దయ కలవాడు కావడమే. ఎంతైనా మేనమామ కనుక ఆ మాత్రం వుండనిచ్చాడు. మరొకడైతే చాలా కష్టాలే వచ్చేవి " అన్నారు.

దమయంతి మాట్లాడలేదు.

" తప్పా వొప్పా అని కాదుగానీ ఈ సంఘంలో ఈ సంసారాలకి కొన్ని హద్దులున్నాయి. వాటిని అతిక్రమించటం చాలా కష్టం. నిజానికి పార్వతికి అంతటి తెగింపు ఎలా వచ్చిందో అర్థం కాదు. పోనీ కోరికలు తీరనంత వయసూ లేదు - అంతా ఖర్మ " అని సానుభూతిగా నిట్టూర్చారు. పరాశరుడుగారు, దమయంతి నిశ్శబ్దంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయారు. బయట మబ్బులు కమ్ముకొస్తున్నాయి. పెద్ద వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. దమయంతి మనసునిండా ముసురు పట్టేసినట్లుగా ఉంది. ఒక్కసారి హోరున వర్షం కురిస్తే బాగుండునని ఉంది. తన భర్త చేసిన పొరపాటుకి తను కోపగించి ఇక్కడికి వచ్చేసి ఉండకపోతే బాగుండేది ! అతన్నలా వదిలేయడం వల్ల మరీ పతనమైపోయే ప్రమాదముంది.

తనెందుకంతమాత్రం ఆలోచించలేకపోయింది ? ఇంతకాలం అతని ఆలనా పాలనా ఎవరు చూశారు ? ఎవరు చూసినా అలాంటి అవకాశం యిచ్చింది తనేకదా ! ఏది ఏమైనా రేపు తెల్లవారగానే తను బయలుదేరి వెళ్ళిపోవాలి. ఈరోజే వెళ్ళొచ్చు. కాని తనలోని అలజడిని తండ్రి గ్రహిస్తే, తను భరించలేదు .... దమయంతి ఆలోచనల తుఫానులో కొట్టుకుపోతోంది.

ఇంతలో " నమస్కారం అయ్యా " అంటూ ఎవరో రావడంతో దమయంతి అసంకల్పితంగా లేచి లోపలికెళ్ళిపోయింది. అశక్తతగా మంచం మీద వాలిపోయింది. మనసు అలసిపోయింది. మగత నిద్రలోకి జారుకుంది.

" దమయంతీ భోజనానికి లేమ్మా ! నాన్నకి, నీకూ వడ్డిస్తున్నా " అన్న మేనత్త పిలుపుకి లేచింది. బయట సన్నగా జల్లు పడుతోంది. కాళ్ళూ చేతులూ కడుక్కొని వంటింటివైపు నడవబోతుండగా బయటనుంచి తండ్రి గొంతు విని కాళ్ళకు ఏవో బంధాలు పడినట్లు ఆగిపోయింది.

" రావోయ్. రా. ఏమిటి ఎప్పుడు బయలుదేరావ్ " అంటూ ఆహ్వానిస్తుంటే దమయంతి గుండెలు ఆనందంతో, ఆందోళనతో దడదడ లాడాయి. అడుగులు తడబడుతూ వీధి గుమ్మంలోకి తొంగిచూసింది. నిజమే. అతనే - అనుకోకుండా తనూహించలేని విధంగా విశ్వం రానేవచ్చాడు.

ఇన్ని రోజులు అతన్ని చూడకుండా ఒక్కసారి చూస్తే చిత్రమైన అనుభూతి కలుగుతోంది. సన్నటి జల్లు అతని ముంగురులమీద పడి ముత్యాల్లా వున్నాయి. ముఖం మీద జుట్టు చెదిరిపడి వుంది. తెల్లని అతని ముఖంమీద నల్లని జుట్టు అందంగా కదులుతోంది. ఉల్లాసంగా వుండే అతని కళ్ళు మాత్రం కాంతివిహీనంగా వున్నాయి. దమయంతికి ఎంతో బాధ కలిగింది. ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది. ' ఒకప్పుడు

అతన్ని కోరి వలచి పెళ్ళిచేసుకుంది. అతను అశాంతితో విలవిల్లాడి పోతోంటే అతనికి ఆసరా యివ్వాల్సిన బాధ్యత తనకు లేదా! అతనేం చేశాడో, ఎందుకు చేశాడో అడక్కుండా, ఆలోచించకుండా అతన్ని వదలి వచ్చేసింది. తనలో మానవత్వం, దయ, ఆదరణ అన్నీ నశించి పోయాయా! తను ఎంత స్వార్థంతో ప్రవర్తించిందో తలుచుకుంటే సిగ్గేస్తోంది' అమాయకంగా, అలసటగా వున్న భర్త ముఖం చూసి దమయంతి కరిగిపోయింది.

అతను నవ్వు ముఖాన పులుముకుని,

"మీ ఆరోగ్యం బాగుందా" అని మామగార్ని పలకరించాడు, దమయంతి మనసు చివుక్కుమన్నా వెంటనే సర్దుకుంది. నోటితో అడగకపోయినా కళ్ళు తనకోసం వెదకటం కనిపెట్టి ఆమె హృదయం పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది.

దమయంతి వీధి వరండాలోకి రావడం, పరాశరుడుగారు ఆమెని పిలవడం ఒకేసారి జరిగాయి. దమయంతి విశ్వాన్ని చూసి నవ్వింది. నీటిపొర కళ్ళల్లో తళుక్కుమంది. విశ్వం ఆమె ముఖంలో కనిపించిన అనురాగానికి కొంచెం చలించాడు.

అతని దగ్గరగా వెళ్ళి చేతిలోని బ్యాగ్ అందుకుంది. అతను అక్కడే కుర్చీలో కూర్చుండిపోయాడు. అంతలో మంచినీళ్ళు తెచ్చి "స్నానానికి నీళ్ళు పెడతాను" అంటూ లోపలికెళ్ళింది దమయంతి —

విశ్వం మనసు నిలవడంలేదు. మామగారు ఏవో అడుగుతున్నారు. తనేదో చెప్తున్నాడు. 'ఒక్క క్షణం దమయంతితో ఏకాంతంగా మాట్లాడితేచాలు. ఎన్నో మాటలు కాదు. ఒకే ఒక్క మాట' అని తపించిపోతున్నాడు. దమయంతి తనే స్వయంగా నీళ్ళు బాత్‌రూంలో పెట్టింది. తువ్వాలు, సబ్బు పెట్టి రాబోతుంటే విశ్వం లోపలికొచ్చేశాడు. ఒక్కక్షణం అలాగే నిలబడిపోయింది. తనేమైపోతోందో తెలీని స్థితి అది. ఎవ్వరూ లేని ఆ సమయం అతను వృథా చేసుకోలేదు.

" దమయంతీ " అన్నాడు.

అతనికేసి చూసిందామె. ఆ కళ్ళనిండా నీళ్ళు.

" నన్ను క్షమించవా " అన్నాడు.

ఆ మాటకి ఎలా సమాధానం చెప్పాలో - ఏమీ చెప్పకుండా ఎలా వుండాలో అర్థం కాలేదు. అతని చెంపమీద చేత్తో ప్రేమగా నిమిరి, " మీరలా మాట్లాడకూడదు " అని చటుక్కున బయటికొచ్చేసింది.

విశ్వానికి ఏనుగంత బలం వచ్చింది అంత కోపంగా వచ్చిన దమయంతి ఇంత బేలగా ఎందుకు మారిపోయిందో తెలీకపోయినా, తనని విడిచి ఆమె ఉండలేదన్న ఊహ అతనికెంతో తృప్తినిచ్చింది.

నాలుగు మెతుకులు తిన్నాననిపించి, గదిలో మంచంమీద వాలాడు విశ్వం. క్షణం ఒక యుగంలా దమయంతి కోసం ఎదురుచూస్తూ పడుకున్నాడు. ఆమె గుమ్మంలో కనిపించగానే ఒక్క వుదుటున లేచి ఒకే ఒక్క అంగలో ఆమెని వాటేసుకున్నాడు. దమయంతి వెక్కి వెక్కి ఏడ్చింది. అతన్నుంచి దూరమైనందుకు—అతను తననుంచి దూరంగా వెళ్ళి బాధించినందుకు, పార్వతిని క్షమించిన చిట్టిబాబులా తను ఆలోచించలేకపోయినందుకు, ఆనందమయమై సాగిపోయే తమ సంసారంలో కలతలు చెలరేగినందుకు. ఇలా ఎన్నో విషయాలు మనసును దెబ్బతీస్తే అవన్నీ జ్ఞాపకం వస్తే, దమయంతి అపుకోలేనంత ఏడ్చింది. ఆమె దుఃఖానికి పూర్తి కారణం తెలీకపోయినా, విశ్వం ఆమెని చూసి, ఇంత జరిగి మళ్ళీ కలుసుకున్నందుకు. సుకన్య వ్యామోహంలోపడి తనెంత పక్కదారి పట్టిపోయిందీ, తన కెదురుదెబ్బ తగిలి, తల బొప్పికట్టాక తను కోల్పోయిన దాని విలువ తెలుసుకున్నదీ తలుచుకుని కరిగిపోయాడు. అత్యంత సన్నిహితంగా ఆరోజు ఒకరు గురించి ఒకరు బాధపడ్డారు. మర్నాడు తమ యింటికి వెళ్ళిపోవడానికి యిద్దరూ ఆత్రుతపడటం మొదలుపెట్టారు.

*

గుమ్మంలో బండి ఆగిన శబ్దం విని తొంగిచూసింది పార్వతి. బండిలోంచి సూరమ్మ, పిల్లలు దిగుతుంటే చూసి ఆనందంతో ముందు కురికింది. స్తంభించిపోయినట్లున్న కాలం ఒక్కసారి చైతన్యవంతమై నట్లామె కనిపించింది.

" అమ్మా, సూరమ్మక్కయ్య వచ్చిందే " అంటూ కేక పెట్టింది.

సుభద్రమ్మ వంట ఇంట్లోంచి మండవాలోకొచ్చి చూసింది పార్వతి వీధిలో కెళ్ళి, సూరమ్మ కొడుకుని ఎత్తుకొని ముద్దుపెట్టుకుంది

" రావే సూరమ్మా ! అంతా బాగున్నారా ? " అంటూ పలకరించింది సుభద్రమ్మ.

" ఉన్నాం పిన్నీ ! నువ్వేమిటి చిక్కిపోయావు అమ్మమ్మేదీ " అంది.

" లోపల పూజ గదిలో వుంది. ఆవిడెప్పుడూ అక్కడేగా ! " అంది సుభద్రమ్మ.

" ఉన్నది పదిమైళ్ళ దూరంలో అయినా, రావడానికే పడదు. ఎప్పట్నుంచో ఒక్కసారి వచ్చి అందర్నీ చూడాలని " అంది లోపలకొస్తూ సూరమ్మ.

"పార్వతీ ! అక్కయ్యకి కాళ్ళకి నీళ్ళిచ్చి, మంచినీళ్ళు పట్టుకురా"

" బాగుంది వరస. నేనేమైనా వియ్యాపురాల్నా ! నే వస్తాలే లోపలికి " అంటూ ముందుకు కదిలింది సూరమ్మ.

సుభద్రమ్మ చనిపోయిన అక్క కూతురు సూరమ్మ. అక్కయ్యంటే ఎంత ప్రేమో, సూరమ్మంటే అందరికీ కాస్త భయమే. దానికి కారణం పెద్దగా ఏమీలేదు. సూరమ్మ అసాధ్యురాలు. ఇల్లంతా ఒక్కసారి కలియచూస్తే, ఏడాది క్రితం ఏం జరిగిందో చెప్పగలదు. ఆవలించ కుండానే ఎవరి మనసుల్లో ఏముందో అద్దం పట్టినట్టు గ్రహించేయగలదు.

సూరమ్మకి ఇద్దరు మగపిల్లలు. భర్తకి వ్యవసాయం పదిమైళ్ళ దూరంలో వున్నా ఆమె అస్తమానూ రాదు. సూరమ్మకి రావాలని వున్నా కుదరదు. అయినా అప్పుడప్పుడు గొడవపెట్టి వచ్చేస్తూ వుంటుంది. "తల్లి పోనేపోయింది అమ్మమ్మని చూడాల"ని రాగాలు పెడుతుంది మొగుడి దగ్గర—అతను ఎలాగో ఒప్పుకుని నాలుగు రోజులుండి రమ్మంటాడు. ఆమె కనీసం పదిరోజులైనా వుండిగాని వెళ్ళదు.

ఏడాదిగా రాలేదు సూరమ్మ. ఆప్యాయంగా ఆహ్వానించింది సుభద్రమ్మ.

సూరమ్మ గలగలా మాట్లాడటం మొదలుపెట్టింది. పార్వతి మొదటినుంచీ అంతగా మాటకారి కాదు. మనసులో ఎంతో మధనపడినా పైకి రెండు మాటలు ఊడిపడవు. మాట్లాడకపోవడం పొగరుబోతుతనంగా అనిపిస్తుంది ఎదుటివారికి. తను చెప్తామనుకున్నది చెప్పలేక ఒక్కోసారి తనూ బాధపడుతుంది.

ఇంట్లో సూరమ్మని చూసి చిట్టిబాబు సంబరపడ్డాడు. ఈమధ్య ఇల్లు మరీ నిశ్శబ్దంగా శవం వెళ్ళిన ఇల్లులా భయంకరంగా వుంటోంది. అది భరించటం కష్టంగా వుంది. పూర్వం పార్వతి అప్పుడప్పుడు కూనిరాగాలు తీస్తూండేది అదో సందడిగా వుండేది. సుభద్రమ్మ లక్ష్మి అష్టోత్తరం, లలిత సహస్రనామం రాగయుక్తంగా పాడుకుంటూ పనిచేసుకునేది. ఇప్పుడు అందరి నోళ్ళకీ తాళం పడింది.

అందుకే సూరమ్మని చూస్తే కాస్త హాయిగా అనిపించింది చిట్టిబాబుకి.

సూరమ్మ వచ్చినప్పటినుంచి చిట్టిబాబుని ఒక్క క్షణం వదలడం లేదు. ఒకటే కబుర్లు అన్నం పానం అన్నీ తనే చూస్తోంది. పిల్లల్ని పార్వతికి వదిలేసి, చిట్టిబాబుతో ఎక్కడలేని కబుర్లూ పెట్టుకునేది. తమ్ముడి ముఖంలో కాస్త నవ్వు కనిపించేసరికి సుభద్రమ్మ అదే చాలు అనుకుంది.

మూడు రోజులూ అటూ ఇటూ తిరిగి విషయం పసికట్టేసింది సూరమ్మ. కారణం తెలీకపోయినా పార్వతిని చిట్టిబాబు ఏలుకోవడం లేదు అని గ్రహించింది. కారణం తెలుసుకునేవరకు ఆమె మనసు నిలవడం లేదు. పార్వతి ముంగి, మాట్లాడదు.

ఆ రోజు సాయంత్రం బయటకెళ్ళకుండా ఇంట్లోనే వుండి పోయాడు చిట్టిబాబు. ఎరువులకోసం పొరుగూరు వెళ్ళి నాలుగు గంటల కొచ్చి భోజనంచేసి విశ్రాంతిగా పడుకున్నాడు. సూరమ్మకి చిట్టిబాబుమీద మొదట్నుంచి వ్యామోహం వుంది. ఆమెకి ఊహ తెలిసినప్పటినుంచి మేనమామకి ఇచ్చి పెళ్ళిచేస్తారని అనుకునేది. ఇంట్లోనూ, బంధువులు అదే మాట అనేవారు కాని సూరమ్మ తండ్రి మాత్రం ఆ మాటెత్తితే మండిపడేవాడు, ఆయన పూర్తిగా వ్యతిరేకించటం వల్లనే సూరమ్మ పెళ్ళి చిట్టిబాబుతో జరగలేదు. సూరమ్మ పెళ్ళయిన ఏడాదికే తండ్రి పోతే, ఆ పోయిన రోజున ఆమె ఆ ఏడుపుతో తన సొంత ఏడుపు కూడా కలిపి మరీ ఏడ్చింది. అన్నింటికి ముఖ్యంగా చిట్టిబాబుకి వెనకాల బోలెడు ఆస్తి వుంది. అమ్మమ్మకి ఎన్నో నగలున్నాయి. ఒక్కడే కొడుకు చిట్టిబాబు. అందరితో ఎలా వున్నా సూరమ్మతో చనువుగా, హుషారుగా వుండేవాడు. అందుకని మరీ సంబరపడింది. అయితే ఆమెకి మరో సంబంధం చెయ్యడం అనుకోకుండా పార్వతితో చిట్టిబాబుకి పెళ్ళయిపోవడం బాధగా వున్నా, బయటపడే అవకాశం లేకపోయింది.

ఆకాశంనిండా మబ్బులు ముసురుకున్నాయి. ఆరు గంటలకే చీకటి నలువైపులా అలుముకుంది. సుభద్రమ్మ సూరమ్మ పిల్లలకి అన్నాలు పెట్టేసింది. పార్వతి మండువాలో మంచం వేసుకుని పిల్లల్ని పక్కన పడుకోబెట్టుకుని కథలు చెప్తూంది.

పార్వతి పైకి ఎంత గంభీరంగా వుందామని ప్రయత్నించినా మనసులో అలజడి అరికట్టలేకపోతోంది. ఏదో కోల్పోతున్నట్లు రివ్వున వీచే గాలిలో, చెలరేగే తుఫానులో కొట్టుకుపోతున్నట్లు, వంటరిగా ఎడారిలో చిక్కుకుపోయినట్లు, కళ్ళు కనిపించనట్లు, కాళ్ళు కదలనట్లు చిత్ర విచిత్రమైన బాధ ఆమెని నలిపివేస్తోంది. అయినా తనలోని ఆవేదన ఎలా చెప్పుకోవాలో తెలీదు. తన భర్త దగ్గరకి తనుగా వెళ్ళి కాళ్ళమీద పడి క్షమాభిక్షకోరే ధైర్యం, చాకచక్యం తనకి లేవు. మనసులో అనుభవిస్తున్న పశ్చాత్తాపం పెదవులు దాటి రావడంలేదు. అతని ముందుకు వెళ్ళాలంటే భయం, బెరుకు, దానికితోడు అతను ఆనాటినుంచి తనని కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకరించలేదు అందుకే ఆ చిత్రవధ నుంచి మళ్ళించుకోవడానికి ప్రయత్నం చేస్తూంటుంది.

సూరమ్మ భోజనాలయ్యాక చిట్టిబాబు గదిలోకి వెళ్ళి కబుర్లు మొదలు పెట్టింది. అసలే వాగుడుకాయ. అందులో చిట్టిబాబు ముందు మరీ ఎక్కువైన వుత్సాహంతో మాటలు మొదలుపెట్టింది. మౌన సమాధిలో మగ్గిపోతున్న ఆ ఇంటికి సూరమ్మ సందడి తీసుకొచ్చింది. చిట్టిబాబులో గడ్డకట్టుకు పోయిన ఆవేదన కరగడం మొదలయింది. సూరమ్మ తనకెంతో ఆత్మీయురాలిగా కనిపించింది. అతను తనకి జరిగిన అన్యాయం పూస గుచ్చినట్లు చెప్పాడు. తను అక్క ముఖం చూసి పార్వతిని పెళ్ళిచేసు కున్నానని బాధపడ్డాడు. తన మనసు పూర్తిగా విరిగిపోయిందని, ఇంక జన్మలో పార్వతిని భార్యగా స్వీకరించలేనని చెప్తూ—

" పాలేరు వెంకన్న వున్నాడు—బంగారమ్మ కొన్నేళ్ళుగా ఇంటిని పట్టుకుని అన్ని పనులూ చేసిపెడుతోంది. అలాగే ఇంట్లో మరో పనిమనిషి వుందనుకుంటాను " అన్నాడు కసిగా. ఆ మాటలకి సూరమ్మ చలించి పోయింది. పార్వతిమీద అప్పుడప్పుడు అసూయలాంటిది కలిగినా ఆ క్షణంలో ఆమె హృదయం బాణం తగిలిన పక్షిలా గిలగిలా తన్నుకుంది.

కాని పార్వతి ఎందుకిలా చేసింది అనే ప్రశ్నకి ఆమెకి ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. పార్వతి మనస్తత్వం ఎంత యోచించినా అంతుపట్టకుండా వుంది.

తను వచ్చిన నాటినుంచి అమ్మమ్మ ఏ మాటా మాట్లాడలేదు, యోగక్షేమాలు తప్ప. పూజ గదిలోనే ఎప్పుడూ జపం చేసుకుంటూ వుంటోంది. ఇప్పుడాలోచిస్తే, పిన్ని కూడా సుభావంగా, చెప్పుకోలేని బాధతో వున్నట్లు అనిపిస్తోంది. ఆ ఇల్లు ఒక శూన్యగృహంలా అంధకార బంధురంగా అనిపించింది.

" అయ్యో నూరేళ్ళ జీవితం పార్వతిలా ఎందుకు చేసుకుందీ " అని వాపోయింది సూరమ్మ.

అలా ఒక పక్క బాధపడుతున్నా, అంతరాంతరాలలో ఏదో తెలీని ఆనందం, కసితీరిన తృప్తి కలుగుతోంది. తనీ ఇంట్లో రాణిలా వుండాల్సింది—అది ఎలాగో తప్పిపోయింది. ఆ బాధ ఈనాటితో తీరేది కాదు.

ఈనాడు తను చిట్టిబాబుకి దగ్గరగా, ఆత్మీయంగా వున్నానని తలచుకుంటే గర్వంగా వుంది.

ఆనందం, తృప్తి, బాధ. ఆవేదన, కనికరం, కాఠిన్యం, అన్నీ గిర్రున తిరుగుతున్నాయి ఆమె మెదడులో—

పొద్దుపోయేవరకు కబుర్లు చెప్పి బయటకొచ్చి మంచంమీద వాలిన సూరమ్మ రాత్రంతా నిద్రపట్టక కలతపడింది.

*

సూరమ్మ అనుకున్న దానికంటే పదిరోజులు ఎక్కువే వుంది. మొగుడి దగ్గరనుంచి రెండు మూడు ఉత్తరాలు వచ్చాక గునుస్తూ బయలు దేరింది.

ఆమె వున్నంతకాలం చిట్టిబాబుకి సన్నిహితంగా వుండటం సుభద్రమ్మ సహించలేకపోయింది. అయితే మాత్రం ఏం చెయ్యగలదు? పెదవి విప్పే అవకాశం కోల్పోయినట్లు కుమిలిపోయింది. తనని నీచ స్థితికి దిగజార్చిన పార్వతిమీద ఎక్కడలేని కోపం వచ్చింది. పదహారు రోజుల పిల్లగా వున్నప్పుడే ఒక వడ్లగింజవేసి చంపేసి వుంటే ఈ బాధ తనకి తప్పేదని మదనపడింది. అప్పటినుంచీ సుభద్రమ్మ మనసు నల్లరాయిగా మారిపోయింది. ఆమె తన కూతురనే మాట మర్చిపోయింది. ఆప్యాయత పేరే మర్చిపోయింది.

సూరమ్మ వెళ్తుంటే మంచి జరీ చీర కొన్నాడు చిట్టిబాబు. అంత అందమైన చీర ప్రత్యేకం సూరమ్మకోసం తెచ్చాడంటే సుభద్రమ్మ తట్టుకోలేకపోయింది. సూరమ్మ చీర కట్టుకుని అందరి కాళ్ళకీ దణ్ణాలు పెడుతుంటే పోనీలే తల్లిలేని పిల్ల, పుట్టింటి ఆశ లేకపోతే ఏమైపోతుంది అని సరిపెట్టుకుని, సూరమ్మని ఆప్యాయంగా కౌగలించుకుని సాగనంపింది సుభద్రమ్మ.

సూరమ్మ అమ్మమ్మని కౌగలించుకుని ఏడ్చింది. ముసలవ్వ మాత్రం గంభీరంగా, నిర్వికారంగా సాగనంపింది—

నిజంగా సూరమ్మ వెళ్ళగానే ఇంట్లో దీపం ఆరిపోయినట్లు మళ్ళీ చీకటి అలుముకుంది. చిట్టిబాబు దక్షిణపు గదిలో చేరిపోతే పార్వతి ఉత్తరపు సావిట్లో ఒక మూల నక్కి కూర్చుండిపోయింది.

సుభద్రమ్మ మామూలుగా సూర్యాస్తమయాలు చూస్తూ గడిపేస్తోంది.

కరుణలేని కాలం కదులుతూనే వుంది. కరడుగట్టిన చీకటి కరగకుండానే వుంది.

*

దమయంతి, విశ్వం వాళ్ళ వూరు వచ్చేసి నెలకావస్తోంది. ఇద్దరిలోనూ ఉద్రేకాలు తగ్గిపోయాయి. కాని వారి మధ్య, గాయం

మానిపోయినా చెరగని మచ్చలా ఒక అసంతృప్తి మిగిలిపోయింది. ఇద్దరూ ఒక్కొక్కసారి ఎంతో ఆలోచించి ఇది ఇలా జరక్కుండా వుంటే ఎంత బాగుండేది అనుకుంటారు. దాన్ని అధిగమించటానికి ప్రయత్నించి చిరాకుపడతారు ఒకరి నొకరు చీదరించుకుంటారు.

ఆరోజు దమయంతి ఎందుకో చాలా నీరసంగా వుంది. ఒకటే నిద్ర. మధ్యాహ్నమంతా నిద్రపోయినా లేవాలని లేదు. ఉత్సాహాన్ని కల్పించుకుందామన్నా మనసు మూగగా, వేదనగా అయిపోతోంది. 'తనెంతో ప్రేమించిన భర్త తన నుంచి దూరమైపోయి, మరో స్త్రీ వెంట బడటానికి తనెంతవరకు బాధ్యురాలు అని ఎంత ఆలోచించినా అది తెగదు. తనవైపు నుంచి మరోవైపు మళ్ళిపోయి అక్కడ ఆటలు సాగక, మళ్ళీ ఇటువస్తే సిగ్గుమాలి అతన్ని చేరనిచ్చింది? భర్త! అదొక పెద్ద ముసుగు కాకపోతే ఏమిటి? అన్నిటికీ మూలం తన చేతకాని తనం—అంతే మరోటి కాదు....'

" దమయంతీ " విశ్వం గట్టిగా పిలవడంతో వులిక్కిపడింది.

"ఏమిటలా పడుకున్నావ్, చీకటిపడినా తెలీలేదా" అన్నాడు విశ్వం.

" నాకేమీ బాగోలేదు " అంది ఏం చెప్పాలో తెలీక.

" బాగుండకపోతే డాక్టరు దగ్గర కెళ్ళకపోయావా? " అంటూ లోపలికెళ్ళిన అతన్ని చూస్తూ వుండిపోయింది దమయంతి.

నెమ్మదిగా లేచి వంటపని పూర్తిచేసుకున్నది. భర్త ఇంట్లోనే వేరే గదిలో వున్నా, అతని చెంతకి వెళ్ళాలి, మాట్లాడాలీ అనిపించటం లేదు—ఏదో ఆదీ ఇదీ సర్దుతూ కాలక్షేపం చేస్తోంది. అతనే తనని పిలిచి మాట్లాడకూడదా అని ఒక్కో క్షణం అనిపిస్తుంది. మళ్ళీ అంతలోనే తనేదో పనిలో మునిగిపోవాలనిపిస్తుంది. అంత ఒంటరిగా కూర్చుని అతను మాత్రం ఏ పుస్తకమో ఎందుకు చదువుతూ కూర్చోవాలి అనే అక్కసు కలుగుతుంది.

దమయంతి పిచ్చి ఊహలతో సతమతమవుతూనే వుంది.

" దమయంతీ కాఫీ " అన్నాడు విశ్వం.

" ఊఁ " అని మాత్రం అని కాఫీ కలిపి అతనికి తీసుకెళ్ళింది.

" ఎందుకంత 'డల్'గా వున్నావు ? వంట్లో బాగుండలేదా ? " అన్నాడు. ఇప్పుడతని మాటల్లో ఎంతో మార్దవం వుంది. ఆమె ఏమీ సమాధానం చెప్పకుండా నిలబడింది.

అతనామెను దగ్గరకు తీసుకొని " దమయంతీ, నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా " అన్నాడు.

ఆమె నెవరో కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లనిపించింది. ఇంత నటన జీవితంలో తగునా అనే వూహ ఆమె నరాల్లో చర్రున ప్రవహించి నిలువెల్లా వణికింది. అతనికా స్పర్శలో ఆమెలోని అనుమానం, అయిష్టతా చురుక్కున హృదయానికి తగిలాయి. అతని చేతులు సడలిపోయాయి. ఆమె దూరంగా జరిగింది.

అతని మనసు తీవ్రంగా గాయపడింది.

" నేనేదో పొరపాటు చేశానని నన్ను నిరంతరం ఇలా బాధించటం భావ్యం కాదు " అన్నాడు కోపంగా.

" ఇప్పుడు నేనేమన్నాను " అంది నెమ్మదిగా.

" అవును. నువ్వేమీ అనవు. అనలేదు " అంటూ కాఫీ అక్కడే వదిలేసి అతను బయటకెళ్ళిపోయాడు.

ఇది ఇలా జరిగి వుండాల్సింది కాదు అనిపించింది దమయంతికి. కానీ జరిగిపోయింది. మన మనసులోని భావాలు ఒక్కొక్కసారి మన మాట వినవు. వాటి ప్రభావం మన ప్రవర్తనమీద వుండక తప్పదు. ఇవి మనుష్యుల మధ్య అగాధాలకీ, అనుమానాలకీ సోపానాలవుతాయి.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఎంతో హాయిగా సాగుతున్న తన జీవితంలో ఆ సుకన్య ఎందుకు ప్రవేశించాలి ? అది తనకి ఇంత కార్చిచ్చుగా ఎందుకు మారాలి ? తనెందుకా విషయం మర్చిపోలేకపోవాలి?" మెరుపులా ఆమె మనసులో చిట్టిబాబు మెదిలాడు. అతనెంతో సంస్కారంతో పార్వతిని చూసుకుంటున్నాడు అనిపించింది. ఆమెకు తన మనసే ఇంత పాడైపోయిందేమో అని మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. భర్త ఇంటికి రాగానే క్షమాపణ కోరాలని, అతని బాధని తన మాటలతో పోగొట్టాలని మళ్ళీ మళ్ళీ అనుకుంటూ మంచంమీద పడుకుంది. ఇలాంటి చిన్న చిన్న ఒడిదుడుకులు వచ్చినంత మాత్రాన జీవితం పాడుచేసుకోకూడదని తనకి తను నచ్చచెప్పుకుంది. తానేదో బాగుచేసుకోవాలనుకున్నా మనమ్మత్తు కుదురుతుందా అని భయం కూడా ఒక పక్క మనసులో వేధిస్తుండగా, అశాంతిగా కళ్ళుమూసుకుంది.

*

రోజులు గడుస్తున్నకొద్దీ పార్వతిలో కోర్కెలు పురివిప్పి నాట్యం చెయ్యడం మొదలుపెట్టాయి. చేతినిండా పనిలేదు. ఆదరించే తోడు లేదు. ఏ రోజు ఏ చిరాకు వచ్చినా తల్లి తననే అనరాని మాటలని చీదరించుకుంటుంది. తనంత పాపాత్మురాల్ని కనడంవల్ల ఆమె జన్మ పాపిష్టి జన్మయిపోయిందని బాధపడుతుంది.

అరటిచెట్టు గెలవేసి వంగిపోయింది. ఒక పక్కకి వాలిపోయింది గెల ముదరగానే చెట్టు కొట్టివేయాలి.

గెల ముదిరిపోయింది కొట్టేశారు. ఆ రోజు అరటిచెట్టు కొట్టెయ్యాలని సుభద్రమ్మ మొదలుపెట్టింది. పార్వతి తల్లికి సహాయం చేద్దామని వచ్చింది. ఒక్క గెల వేసి అరటిచెట్టు బ్రతుకు చాలిస్తుంది. తను కూడ ఒక్క బిడ్డని కని చచ్చిపోతే బాగుండును అనిపించి పార్వతి శరీరమంతా ఒణికింది. ఆ ఆలోచన రావడానికి ముందుగా తనేమీ

సంసిద్ధురాలు కాలేదు. అలాంటి వూహ తనకెందుకు వచ్చిందా అని బాధపడింది. తనకా అదృష్టం ఏది ? మోడులా ఇలా ఎన్నాళ్ళు బ్రతకాలి ? మనిషయిన తర్వాత ఎలాగూ పోక తప్పదు. మొన్నటిదాకా వున్న అమ్మమ్మ అనుకోకుండా అకస్మాత్తుగా పోయింది. ఆమె ఏమీ కష్టపడలేదు. ఆ రోజు మడికట్టుకుని వడియాలు కూడా పెట్టింది. భోజనం చేసి విశ్రాంతిగా పడుకుని మరి లేవలేదు. తనూ ఒకరోజున అలా పోతే బాగుండును. కానీ ఈలోపున ఒక్క బిడ్డ కలిగితే. వాడి చిట్టి చిట్టి చేతులతో తన గుండెనంతా తడిమితే - వాడి చిన్నారి పాదాలతో ఈ గుండెలెక్కి తొక్కితే —

పార్వతి పరధ్యానంలో వుండటం వల్ల అరటి బొంద నిలువునా పడిపోయింది. మురికినీళ్ళు ఇన్దరిమీదా చిందాయి.

" ఏమే మొద్దూ. ఏదో ఆలోచనేగాని పనిమీద ధ్యాసలేదు. పట్టుకోమనేకదా నిన్ను ఇక్కడ నిలబడమన్నాను, ఎందుకలా కొయ్యలా నిలబడి లాభం? చాల్లే తప్పుకో " అంటూ విసుక్కుని - " తెలివి లేని మొద్దువి కనుకనే ఈ బ్రతుకిలా తెల్లారింది " అంటూ సణగడం మొదలు పెట్టింది. రెండు చేతులా పట్టుకుని వాలిపోయిన అరటిబొంద తీసి గోడకి నిలబెట్టింది పార్వతి. అంతలోనే గుమ్మంలో అడుగుపెట్టింది దమయంతి.

పార్వతి హృదయం ఆనందంతో ఉక్కిరిబిక్కిరైంది. ఒక్క పరుగున దమయంతి చేతిలో వున్న బంతిలాంటి బాబుని అందుకుంది.

" ఏం పేరు పెట్టారు " అంది బాబువంక ముచ్చటగా చూస్తూ.

" పరాశర్ " అంది దమయంతి.

ఆమె బాగా చిక్కింది. నల్లబడింది. అంతకు ముందు ఆమెలో వున్న అందం తగ్గిందనిపించింది.

" నువ్వేమిటి దయా చిక్కిపోయావు " అంటూ సుభద్రమ్మ అక్కడికొచ్చింది.

" లేదత్తా ! నేను బాగానే వున్నాను " అంది.

" కొడుకునెత్తుకున్నావుగా ఆ ఆనందంలో తిండి మానేశావేమిటే? " అంది సుభద్రమ్మ వేళాకోళంగా.

పార్వతి పరాశర్ ని గుండెల కదుముకుంది. వాడు పలకరించక పోయినా, నోరంతా తెరచి నవ్వేస్తున్నాడు. ఆ నవ్వులు చిత్తకార్తెలో వానజల్లులా ఆనందాన్ని వొలకబోస్తున్నాయామె హృదయంలో.

పార్వతికి గుండెలు గుబగుబ లాడుతున్నాయి. దుఃఖం ఆగేట్టు లేదు. ఆ బాధకి పూర్తిగా అర్థం కూడా తెలియటంలేదు. నరాలన్నీ పీక్కుపోతున్నట్టు అనిపిస్తోంది. ఆ పసివాడ్ని ఎంత గట్టిగా హృదయానికి అదుముకున్నా తనివితీరటంలేదు. ఆ ఉద్వేగం ఆగటంలేదు. ఊరట కలగటంలేదు.

బాబుని తీసుకుని లోపలికి పరుగెట్టింది. తన కళ్ళలో నీరు వుబికితే అది ఎవరైనా చూస్తారేమోనని బాబు బుగ్గంమీద ముద్దులు కురిపిస్తూ లోపలికి వెళ్ళిపోయింది. సుభద్రమ్మ కూతురులోని కలవరం కొంత వరకు కనిపెట్టింది. ఆమె మనసుని ఎవరో పిండినట్లు బాధపడింది. అయినా బయటపడకుండా నవ్వు ముఖాన పులుముకుని దమయంతిని లోపలికి తీసుకెళ్ళింది. అంతా కబుర్లలో పడ్డారు. ముసలామె పోయినందుకు దమయంతి బాధపడింది. ఆమె పోయిన తీరు విని ఆశ్చర్యపోయింది.

పార్వతి బాబు నోట్లో పటికబెల్లం పెట్టింది. వాడు దాన్ని చప్పరిస్తూ, నవ్వుతూ చొక్కా అంతా చొంగ కార్చేస్తుంటే అంతా నవ్వుకున్నారు.

పార్వతి మనసు ఆనందంగానూ వుంది. మరి కాసేపటిలో, దమయంతి పిల్లవాడ్ని తీసుకుని వెళ్ళిపోతుందని బాధగానూ వుంది.

" ఏమే పరాశర్‌ని వదలలేకుండా వున్నావు ! పిల్లలంటే మోజుగా వుందా ! బోలెడంత ఖాళీగా వున్నావు, కనేయక పోయావా ఓ నలుగుర్ని" అంటూ ఎగతాళి చేసింది దమయంతి. పార్వతి వినిపించుకోనట్లు వూరుకుంది. సుభద్రమ్మ ముఖం మాత్రం వివర్ణమైంది. మనసు కల్లోలమైపోయింది.

" ఆ అదృష్టం అందరికీ వుండొద్దూ " అంది.

" ఏమిటీ మీరు నిజంగానే దాని పిల్లల గురించి బెంగ పెట్టేసుకుంటున్నారా ? బాగుంది పుడతారులెండి ! కంగారేముంది " అంది దమయంతి తేలికగా తీసేస్తూ. సుభద్రమ్మ నిట్టూర్చి వూరుకుంది.

ఎన్ని కబుర్లు చెప్పుకున్నా సుభద్రమ్మ, దమయంతీ చెప్పుకున్నారు. పార్వతి మాత్రం పరాశర్‌తో రకరకాల ఆటలు ఆడుతూనే వుంది. వాడు ఆడుతూ, ఆడుతూ నిద్రపోయాడు. వాడ్ని మంచం మీద పరుకోబెట్టి రెండు వైపులా దిళ్ళు పెట్టింది. అప్పుడు దమయంతి దగ్గరకు వచ్చింది.

" వాడు లేస్తూనే మంచం మీద మర్యాద చేస్తాడు " అంది దమయంతి.

" మరేం ఫర్వాలేదు " అంది సుభద్రమ్మ — ఆమె మానసికంగా అలసిపోయినట్లయి అక్కడే ఒరిగింది.

దమయంతి కుట్లూ, అల్లికలూ, ముగ్గులు గురించి మాట్లాడుతోంది. సాయంత్రం అవుతుండగా దమయంతి పరాశర్ని తీసుకుని వెళ్ళిపోయింది తన ఆస్తిని తరలించుకుపోతున్నట్లు. విలవిల్లాడిపోయింది పార్వతి. బాబు బుగ్గలు కందిపోయేలా ఎన్నిసార్లు ముద్దు పెట్టుకుందో ఆమెకే తెలీదు.

దమయంతి వెళ్ళిపోయింది. సంజె చీకట్లు ముసురుకుంటున్నాయి. దీపం వెలిగినా, లేకపోయినా ఒకలాగే వుంది పార్వతికి.

దొడ్లో ఆరుబయట మంచం వేసుకుని పడుకుంది. మనసొక శూన్య దేవాలయంలా వుంది. ఎటు తిరిగి పడుకున్నా సుఖంగా లేదు ఏదో తపనగా వుంది. గాలి రివ్వున వచ్చి, శరీరానికి తగిలితే గగుర్పాటుగా వుంది. శరీరానికి ఏ స్పర్శ అయినా నరాల్ని లాగేస్తూంది.

బోర్లా పడుకుంది. మెత్తటి దిండుని కౌగలించుకుంది. గట్టిగా. మరీ గట్టిగా, శక్తినంతా కూడదీసుకుని. మరెక్కడా మిగలనంత శక్తి నంతా ఉపయోగించి గట్టిగా — కౌగిలించుకుంటూ - అలా బిగుసుకు పోయింది. తనకేమయిందో తెలీదు. తనెక్కడుందో తెలీదు.

సుభద్రమ్మ ఘొల్లుమంది. కట్టెలా బిగుసుకుపోయిన పార్వతిని చూసి శోకాలు పెట్టింది. ఇరుగు, పొరుగు వచ్చారు. ఏవో చికిత్సలు చేశారు. గుప్పెట్లు మూసుకుపోయి పావుగంటపాటు పార్వతి అలాగే పడివుంది.

డాక్టరుగారు వచ్చి చూశారు. ఇంజక్షన్ ఇచ్చి, ఏదో వాసన చూపించారు. ఒక నిముషంపాటు వాసన చూపిస్తూ వుండగా పార్వతి నెమ్మదిగా కదిలింది. రెండు తుమ్ములొచ్చాయి. నీరసంగా కళ్ళు తెరిచింది. చేతి గుప్పిళ్ళు విడివడ్డాయి. రెండు చేతుల మధ్య దిండు పట్టు సడలిపోయింది.

మాత్ర ఒకటిచ్చి, " నిద్రపోతే కంగారు పడకండి " అని చెప్పి డాక్టరుగారు వెళ్ళిపోయారు.

ఏది ఎలా జరిగినా కాలం ఆగేది లేదు. అది ముందుకే నడుస్తుంది. వెనక్కి చూడదు. ఏ మార్పూ లేకుండా ఏళ్ళు గడచిపోయాయి.

ఆరోజు ఆకాశంనిండా మబ్బులు కమ్ముకుని ఉదయం తొమ్మిదైనా సూర్యోదయం కాలేదు. గాలి కూడా చల్లగా వీస్తోంది.

చిట్టిబాబు ముందు వసారాలో వాలుకుర్చీలో పడుకుని బద్ధకంగా ఆలోచిస్తున్నాడు. అతని మనసులోనూ మబ్బులు ముసిరి వున్నాయి. ఎప్పుడవి వర్షిస్తాయో, ఎప్పుడీ మనస్సాకాశం నిర్మలమవుతుందా అని అతని ఆలోచన. అనుకోకుండా పార్వతి ఆరోగ్యం చెడింది. నీరసంగా వుండటమే కాకుండా అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చి పడిపోవడంతో మరీ అశాంతిగా వుంటోంది ఇంట్లో. ఈమధ్య చిట్టిబాబు ఆలోచనల్లో పార్వతి ఎక్కువగా చోటుచేసుకుంటోంది. అలాంటి రోగానికి మూల కారణం ఏమిటో అర్థంచేసుకోలేనంత మూర్ఖుడేం కాడు అతను. అయితే అతనేం చెయ్యాలన్నా మనసు వ్యతిరేకిస్తోంది. తనేదో చేతకానివాడు అనే భావం అతన్ని తినేస్తోంది. అందుకే అతను భార్యకు విధించిన శిక్షను సడలించ టానికి ఇష్టపడలేకపోతున్నాడు—అటూ ఇటూ తేల్చుకోలేకపోతున్నాడు. ఒక్కొక్క క్షణంలో తనూ చిత్రవధ అనుభవిస్తున్నాడు.

అతను కుర్చీలో అటూ ఇటూ కదిలాడు. మరోసారి కాఫీ తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

కాఫీ గ్లాసు అందుకుంటుంటే చెయ్యి చురుక్కుమంది. బయట తలుపు కిర్రుమంది. రాములు హడావిడిగా లోపలికొచ్చాడు.

" ఏమిటి రాములు ? ఎప్పుడొచ్చావ్ " అన్నాడు చిట్టిబాబు కాఫీ గ్లాసు నోటిదగ్గర పెడుతూ. రాములు మరింకో మాటేం చెప్పకుండా.

" కాఫీ కానీయండి బాబు, మీకో అర్జంట్ మాట చెప్పాలి ' అన్నాడు.

కాఫీకి, ఆ చెప్పబోయే మాటకీ సంబంధం ఏమిటా అని ఒక త్రుటికాలం ఆలోచించి, గబగబా కాఫీ త్రాగేసి,

" ఏమిటి చెప్పు " అన్నాడు ఆత్రుతగా.

" బసవయ్యగారు రాత్రి పాము కరచి పోయారండి " అన్నాడు ఒకే మాటలో___

" ఆఁ....." అంటూ కేక పెట్టాడు చిట్టిబాబు.

" ఎవరూ...." అంటూ కుర్చీలోంచి లేచాడు.

" అవునండి. మన సూరమ్మగారి పెనిమిటేనండి " వివరించాడు రాములు.

దూరం నుంచి ఈ మాటలు విన్న సుభద్రమ్మ

" అయ్యో అయ్యో, అదేవిఁటి నాయనా ఇంత ఘోరమైన మాట చెప్పావు " అంటూ పరుగెట్టుకొచ్చింది.

రాములు కళ్ళనీళ్ళతో " అంతా ఖర్మండి బాబూ, మీరు బయలుదేరి రావాలండి మీ కోసమే వచ్చాను " అన్నాడు.

బట్టలు వేసుకుని " అక్కయ్యా, నేను ముందు వెళ్తాను. మీరు సుబ్బయ్యతో బండి కట్టించుకుని వచ్చెయ్యండి " అంటూ చిట్టిబాబు రాములుతో వెళ్ళిపోయాడు. సుభద్రమ్మ గుండెలు బాదుకుంటూ—

" అయ్యో సూరమ్మ తల్లీ నీ కెంత కష్టమొచ్చిందే అమ్మా " అంటూ అక్కడే స్థంభానికి అనుకుని కూలబడింది. పార్వతి విషయం తెలుసుకుని, నిర్ఘాంతపోయి, తల్లి ప్రక్కనే కూర్చుంది కళ్ళనీళ్ళతో, కాసేపటికి సుభద్రమ్మ తేరుకుని,

" పార్వతమ్మా ఆ సుబ్బయ్యని బండి కట్టమని చెప్పు తల్లీ వెళ్దాం " అంటూ లేచి చెంగుతో ముఖం తుడుచుకుంది.

సుభద్రమ్మని కౌగలించుకుని బావురుమని ఏడ్చింది సూరమ్మ. ఆమెని ఊరడించటం ఎవరి తరమూ కాలేదు. పసిపిల్లల్ని దగ్గరకి తీసుకుని కళ్ళనీళ్ళు కారుస్తూ కూర్చుంది పార్వతి.

ఆ పల్లెటూరి జనం మొత్తం ఆ యింటిముందే వున్నారు. ఎవరి నోట విన్నా ఒకటే మాట " అయ్యో సూరమ్మగారికెంత కష్టం వచ్చిందీ " అని.

బసవయ్య తండ్రి — పండు ముసలి — దూరంగా వసారాలో బోర్లా పడుకుని కుమిలిపోతున్నాడు.

ఆయన్ని ఓదార్చే ధైర్యం ఎవరికీ లేకుండా వుంది.

ఎప్పుడూ ఇద్దరూ ముగ్గురూ కలసి పొలంనుంచి వచ్చేవారు. ఆనాడు ఎవరూ లేకపోవడం, చేతిలో దీపంలేక అమావాస్య చీకటిలో దారి కడ్డంగా పడుకున్న పాముమీద కాలేసేటప్పటికి అది కాటు వేయనే వేసింది. త్వరగా విషం ఎక్కిపోవడంతో కొంతదూరం వచ్చేసరికి ఎవరో కనిపిస్తే, ఆ మాట చెప్పి పడిపోయాడు. అప్పటికే చాలా ఆలస్యమై ఇల్లు చేర్చాక మంత్రానికి, వైద్యానికి సమయం లేకపోయింది—

ఇంతకీ అతనికి ఆయువు తీరిందన్నారు పెద్దలు.

అన్ని కార్యక్రమాలూ మామూలుగా జరిగిపోయాయి.

ఆ వెళ్ళడం వెళ్ళడం సుభద్రమ్మ, పార్వతి కర్మ అయ్యేవరకు వుండి, తర్వాత సూరమ్మని కూడా తీసుకుని వచ్చేశారు.

సూరమ్మలో మునుపటి కళ లేదు. ఇంట్లో సూరమ్మ బోసిగా వుంటే సుభద్రమ్మకి గుండెలు పిండినట్లుగా వుండేది. సూరమ్మ ముగ్గురు పిల్లలూ

బిక్కు బిక్కు మంటూనే వున్నారు. మూడోవాడికి ఇంకా ఏడాది నిండలేదు. వాడు ఒకటే ఏడుపు. చీకటి గుహలాంటి వాతావరణంలో అంతా ఊపిరి సలపనట్లు కాలం గడిపేస్తున్నారు.

*

“ మీకు ఉత్తరం సార్ ” అంటే వులిక్కిపడి చూశాడు విశ్వం. తనకి పెద్దగా వుత్తరాలు రాసేవారెవరూ లేరు. ఆ కవరు అందుకుంటుంటే చేతులు వణికాయి. ఆ దస్తూరి చూసి గుండె దడదడలాడింది. తన భావాలు ఆఫీసులో పక్కవాళ్ళు గమనించకుండా చాలా సాధారణంగా దాన్ని తీసుకుని జేబులో పెట్టుకొని బయటకొచ్చి పడ్డాడు—

అది సుకన్య రాసినదే. మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత—బుట్టలోంచి తాచుపాము చర్రున లేచినట్లు మనసులోంచి కసి తలెత్తింది.

అయినా ఒక బలహీనత అతన్ని వుత్తరం చించిపారెయ్యకుండా చేసింది. కొన్నేళ్ళ తర్వాత మళ్ళీ ఆ పలకరింత కొత్తగా అనిపించింది. గుండెలో తెలియని మంట బయలుదేరింది.

“ డియర్ విశ్వం,

నా దస్తూరి చూస్తూనే నువ్వు అసహ్యించుకుంటావని నాకు తెలుసు. అయినా నీ మనసులో ఏ మూలో ఒక అవగింజంతైనా నాకు స్థానం వుందనే మొండితనంతో ఇది వ్రాస్తున్నాను.

ఆనాడు నాన్న మాటలు నామీద మంత్రాల్లా పనిచేశాయి. నిన్నే పెళ్ళిచేసుకుని నీతో స్థిరపడిపోయే అవకాశంలేదు. నీ భార్యని ఏడిపిస్తూ చుట్టుపక్కలవారి కోరచూపులనుంచి అనుక్షణం తప్పించుకుంటూ ఇద్దరం ఎప్పుడూ దొంగతనంగా ఎంతని సుఖపడగలం అని నాన్న మాటలు విన్నాను. నిజంగా నా మనసేమిటో నాకిప్పు డర్థంకాలేదు. నీకు చాలా

దూరంగా వెళ్ళిపోతే నిన్ను మర్చిపోగలనని, నేను హాయిగా బ్రతకగలనని అనుకున్నాను. కాని అది అసాధ్యమని ఇన్నినాళ్ళ నా అనుభవంలో అనిపిస్తోంది. నేను పెళ్ళిచేసుకున్న వ్యక్తి—అంటే నా భర్త—చెడ్డవాడని చెప్పడానికి లేదు. అతను అన్నీ బాధ్యతగా చేస్తాడు. సరదాలు, నవ్వులు, కేరింతలు నచ్చవు. మితభాషి. ఒకే ఇంట్లో ఇద్దరం వున్నా చాలాసేపు వంటరిగా ఎవరి దృష్టిలో ఎవరి ధ్యాసలో వాళ్ళుంటాము — అలాంటప్పుడు నా ధ్యాసంతా నువ్వే. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే మనసులోని బాధని చెప్పుకుందామనేగానీ, నిన్ను మళ్ళీ నావైపు ఆకర్షించాలని మాత్రం కాదు. వీలుంటే రాయాలనిపిస్తే—రెండు మాటలు రాయి—పి. ఎస్. నాకు వుత్తరం వ్రాసినా ఆయన చదివే భయంలేదు.

సుకన్య "

ఆ పోస్టు స్క్రిప్ట్‌కి విశ్వానికి వొళ్ళు మండిపోయింది. ఒకప్పుడు తను దమయంతిని మోసగించాడు కాని అప్పుడు సుకన్య ఎవర్నీ మోసగించ లేదు. ఆమెకప్పుడు పెళ్ళి కాలేదు. కాని ఆమె యిప్పుడు చేస్తున్న పనేమిటి ? ఒకప్పుడు తను చేసిన పనే ధైర్యంగా చేస్తోంది. తననీ ప్రోత్సహిస్తోంది.

తన మనసేమిటో తనే అర్థం చేసుకోలేకుండా వున్నాడు. సుకన్య అంటే అసహ్యంగా, కసిగా వుంటుంది కాని మళ్ళీ అదే క్షణం ఒక్కసారి ఆమెని చూడాలని, కాసేపు మాట్లాడాలని, కొన్ని మాటలతో ఆమెని హింసించాలని వుంటుంది. ఆమెని పూర్తిగా పక్కకి నెట్టేసి తను జీవించటం లేదని తనకిప్పుడు పూర్తిగ అర్థమైంది. మనసులో దిగిన ముల్లులా, అప్పుడప్పుడు కలుక్కుమంటూనే వుంది. ఆ ముల్లు పూర్తిగా తీసెయ్యలేకపోయినా, పుండు చేసుకోలేదు తను.

విశ్వం వుత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపి, చెత్త బుట్టలో పడేశాడు.

ప్రశాంతంగా వున్న కొలనులో రాయి, విసిరినట్లు అతని మనసులో పూర్వస్మృతి తరంగాలు కదలడం మొదలుపెట్టాయి.

*

ఒక నెల తిరిగేసరికి సూరమ్మ కోలుకుంది. మామూలుగా అటూ యిటూ తిరుగుతూ, కాస్త మాట్లాడుతూ, పిల్లల్ని చూసుకుంటూ గడుపుతోంది.

చిట్టిబాబు ఉన్నంతసేపు అంటిపెట్టుకుని వుండేది సూరమ్మ. అతనికి కావలసినది తనే అమర్చేది. రాత్రి పొద్దుపోయినా అతనితో ఏవో కబుర్లే సుకుని కూర్చునేది. ఆ విషయం పార్వతి పట్టించుకోకపోయినా, సుభద్రమ్మకి ఎలాగో అనిపించేది. లోలోపల ఏమనుకున్నా పైకి ఏమీ అనేదికాదు. సూరమ్మ కష్టంలో వుండి వచ్చింది ఏమాటంటే ఏమవు తుందో ? అని వూరుకునేది !

రోజులు గడుస్తున్నకొద్దీ సూరమ్మ అక్కడే వుండిపోయేట్లు నిర్ణయం జరిగిందేమోనని సుభద్రమ్మ అనుమానించింది. పై పిల్లలిద్దర్నీ అక్కడే వీధిబడికి పంపడం మొదలెట్టింది సూరమ్మ. ఇంట్లో అన్నీ తనే కల్పించుకుని చేసేది.

పార్వతికి తరుచు ఫిట్సు వస్తూండటం వల్ల సుభద్రమ్మ కూతురిని చూసుకోవాల్సి వచ్చేది. సూరమ్మ ఇల్లు చక్కబెట్టేది. సుభద్రమ్మ మనసు రగిలేది. " సూరమ్మ ఎందుకెళ్ళిపోదూ " అంటూ కుమిలి పోయేది. ఎలాగైనా పార్వతిని చిట్టిబాబు కన్నెత్తి చూసేలా చెయ్యాలంటే కుదిరేట్టు కనిపించలేదు. అసలు సుభద్రమ్మ చిట్టిబాబుతో ఒక్క మాట మాట్లాడే అవకాశమే లేకుండా పోయింది. ఆ కోపం ఈ చిరాకు అంతా పార్వతిమీద చూపించి ఆమెని నానా మాటలూ అనేది.

చిట్టిబాబుకి సూరమ్మతో కాలక్షేపంగా వుండేది. ఎక్కడెక్కడి కబుర్లూ చెప్తూవుండేది. పొలాల తగవులు, పొరుగువారి లొసుగులు, జరిగిపోయిన రోజుల వైభవాలు, సుఖాలు, సంతోషాలు - ఏవేవో మాట్లాడుతూ కూర్చునేది.

ఆరోజు చిట్టిబాబు మనసు రెపరెపలాడుతూనే వుంది. అలాగే పార్వతి గురించి సంభాషణ వచ్చింది.

" నేనొట్టి చేతకానివాడుగా వుండటం ఇష్టంలేదు. అసలు నేనంటే ఏమిటనుకుంది అలా చేసింది ? " అన్నాడు.

" నిజమే నీ తప్పేమీ లేదు - " అంది సూరమ్మ వెంటనే.

" అక్కయ్యకి బాధగా వుంది " అన్నాడు బాధగా.

" ఉంటే వుంటుంది గాని, నీ ఖర్మం కాలింది. కుక్కముట్టిన కుండని నిప్పులో పారెయ్యమంటారు. నువ్వుగాబట్టి బయటకి గెంటకుండా గుప్పెడు అన్నం పెడుతున్నావ్ " అంది.

" నువ్విలా అంటున్నావ్ కాని అక్కయ్యకి అల్లా లేదు. నేను దానితో కాపురం చెయ్యాలని వుంది "

" నేను మాత్రం అలా అనను. దేనికైనా అర్హత ఉండాలి. అత్యాశ పనికిరాదు " అంది. అలా అనడం అగ్నిలో ఆజ్యం పోసినట్లని తెలిసినా, అదొక తృప్తిగా అనేసింది. ఆమె మాటలు అతనికి ఎంతో బాగున్నాయి. సూరమ్మ తనకు ఎంతో ఆత్మీయురాలనిపించింది.

ఇలాంటి సంభాషణ వాళ్ళ మధ్య తరుచు వస్తూండేది. సుభద్రమ్మతో ఎక్కువగా మాట్లాడని చిట్టిబాబు మనసులోమాట సూరమ్మతో చెప్పుకునేవాడు.

*

సూరమ్మ మూడో కొడుకు రమణ ఒకటే ఏడుపు. పెంకితనం మొదలుపెట్టాడు. వాడి బాధ భరించటం అందరికీ కష్టమైపోయింది.

సూరమ్మకి, పార్వతికి, సుభద్రమ్మకి కూడా వాడ్ని ఊరుకోబెట్టటం సాధ్యం కాలేదు. చిట్టిబాబు రమణని ఎత్తుకుని కాస్సేపు తిప్పుకొచ్చాడు. పక్కనున్న కొట్లో రెండు బిస్కట్లు కొని పెట్టాడు. రమణ ఏడుపు కట్టేశాడు. చిట్టిబాబు బుజ్జగిస్తే చక్కగా అన్నం కూడా తిని హాయిగా పడుకున్నాడు. వాడు అంతలో ఊరుకోవడానికీ, మారం మానెయ్యడానికి కారణం ఏమిటో ఎవరికీ తెలీకపోయినా, వాడు నిద్రపోవడమే మహాభాగ్యంగా అనుకున్నారు. సూరమ్మ మాత్రం అంతటితో వదలలేదు. పిల్లాడు తండ్రికోసం బెంగ పెట్టుకున్నాడనీ, చిన్నాన్న ఎత్తుకోగానే కాస్త ఊరట కలిగి పడుకున్నాడు అని చెప్పడం మొదలు పెట్టింది. ఈ మాటలు నిజమేనేమో అని సుభద్రమ్మకి కూడా అనిపించింది. లేకపోతే తామెంత అవస్థపడినా ఊరుకోనివాడు చిట్టిబాబు ఎత్తుకోగానే ఎందుకు ఫూరుకుంటాడు అనుకుంది.

చిట్టిబాబు యిలా ఒకటి రెండుసార్లు ఎత్తుకోవడంతో పిల్లాడు ' చిన్నాన్న ఎత్తుకోవాలి ' అని ఏడవడం మొదలు పెట్టాడు. అతని మాట వినడం, అతనేం చెప్పినా చెయ్యడం, అతన్ని అంటిపెట్టుకుని వుండటం అతని పక్కలోనే పడుకుని నిద్రపోవడం మొదలుపెట్టాడు.

ఒక పదిహేనురోజుల్లో రమణ పూర్తిగా చిట్టిబాబు నీడలా తయారైనాడు. ఒక్కక్షణం వదిలేవాడు కాదు. చిట్టిబాబు బయటకు వెళ్ళినా వచ్చేవరకు గుమ్మంలోనే కూర్చునేవాడు. చిట్టిబాబుకు కూడా రమణతో అనుబంధం పెరిగింది,

రోజులు గడిచిపోతున్నాయి. పార్వతి జీవితం రోజురోజుకీ నిస్సారంగా అయిపోతోంది. దుర్భరంగా తయారైంది. ఆలోచించి, ఆలోచించి ఫిట్స్‌వచ్చి పడిపోయేది, మళ్ళీ ఎప్పుడో లేచేది. ఆమె అలా పడిపోవడం ఇంట్లో అందరికీ అలవాటైపోయింది. ఎవ్వరూ ఆందోళన పడటం మానేశారు.

రాత్రి తొమ్మిది దాటింది. రమణ చిట్టిబాబు మంచంమీద పడుకుని నిద్రపోతున్నాడు.

పిల్లాడ్ని తీసుకువెళ్ళే ప్రయత్నంలో అతని దగ్గరకెళ్ళి వున్నూ రంటూ కూర్చుంది సూరమ్మ. ఏదో పుస్తకం చదువుకుంటూ వున్న చిట్టిబాబు పుస్తకం పక్కన పెట్టాడు.

" ఈ పిల్లాడేమిటమ్మా ఇక్కడేగాని వుండడు " అంది విసుగు నటిస్తూ.

" పోనీలే పడుకోనీ. నాకేమీ భారం కాదు పిచ్చి వెధవ, నా పక్కనే మారుతున్నాడు " అన్నాడు చిట్టిబాబు జాలిగా.

" బాగానేవుంది నాయనా. తండ్రీ కొడుకుల జత " అంది బుగ్గలు నొక్కుకుంటూ.

ఆమె మాటలకి ఒక్కక్షణం చలించిపోయాడు చిట్టిబాబు. అతనిలో పుత్రవాత్సల్యం వెల్లువలా పొంగింది. అంతలోనే మనసు విలవిల్లాడి పోయింది. ముఖం వివర్ణమైంది. అతని మనోభావాలు అనిమిషంలో చదివేసిన సూరమ్మ అతనేం చెప్తాడా అని ఆతృతగా చూడసాగింది. ఆమె ఊహించినట్లే - " నాకీ జన్మకి కొడుకు కలిగే అదృష్టమే లేదు కదా " అన్నాడు కలతగా.

" అదేమిటి మావయ్యా ! అలాంటి మాటలెప్పుడూ అనకు. వాడు నీ కొడుకే. ఏనాటిబంధమో లేకపోతే వాడు నీ దగ్గర అంత మాలిమవ్వడ మేమిటి ? " అంది.

" సూరీ, నాను వీడిని ఇచ్చెయ్యవే. నాకింకేమీ వద్దుగాని " అన్నాడు.

" మహారాజులా తీసుకో – ఇదిగో నేనేదో మాటవరస కంటున్నా ననుకనేవు. నిజంగానే అంటున్నా. కావాలంటే మంచి ముహూర్తం చూడు దత్తత చేసుకుందువుగాని " అంది.

ఆమె మాటలు చిట్టిబాబుకి నచ్చాయి. నిజమే తనకీ, తన ఆస్తికీ ఒక వారసుడు వుండాలి. రమణ తనకెంతో దగ్గరయ్యాడు. ఒక్క క్షణం వదలడు. ఇంత వయసులో వాడు తన దగ్గర చేరితే ప్రేమాభిమానాలు నాటుకుంటాయి. ఇంతకంటే తనేం చేయగలడు ? రేపు సిద్ధాంతిగారినడిగి మంచిరోజు చూసి నలుగురినీ పిలిచి రమణను దత్తత చేసుకుంటే బాగుంటుంది అనుకున్నాడు. తర్వాత చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాక రమణని చిట్టిబాబు దగ్గరే వదిలేసి బయటకొచ్చి పడుకుంది సూరమ్మ.

*

విశ్వానికి ఆ తర్వాత రెండు మూడు వుత్తరాలు వచ్చాయి. అతను చదివి చింపేశాడు. జవాబివ్వలేదు. కాని అతని మనసు మాత్రం చివురుటాకులా రెపరెపలాడుతూండేది. అప్పుడప్పుడు అన్యమనస్కంగా చాలా నిరుత్సాహంగా వుండడం దమయంతి గ్రహించినా ఏమీ చెయ్యలేక పోయేది. అతనలా వున్నప్పుడు ఆమెకి మరీ కసిగా వుండేది. అతన్ని లాలించి అతని బాధని మరిపించాలనిపించేదికాదు. తను కాకుండా అతని మనసులో ఇంకెవరో వున్నారనే ఊహ ఆమె గుండెలు మండించేది. అందుకే విశ్వం డల్‌గా వున్నప్పుడు, దమయంతి అతనికి దూరంగా, ఏకాంతంగా తన ఆలోచనల్లో తనుండిపోయేది.

తనకి మళ్ళీ నెల తప్పింది. కొన్ని పనులు మన ప్రమేయం లేకుండానే జరిగిపోతాయి. వాటికి పూర్తి అంగీకారం లేకుండానే జరిగి పోతాయి అనిపించి – బాధపడింది. ఈ అతుకుల బ్రతుకులకు ఈ సంసారం పెరగడం కూడా ఎందుకు అని ఎన్నోసార్లు అనుకున్నా చేసేదిలేక వూరుకుంది.

ఒక నెల్లాళ్ళు నాన్న దగ్గరకు వెళ్ళివస్తే బాగుంటుందనిపించింది. అలా అనుకున్నాక కొంత తెరిపిగా అనిపించింది.

*

చిట్టిబాబు నిర్ణయం విని సుభద్రమ్మ కొయ్యబారిపోయింది. సూరమ్మ కోటకు పాగా వేసిందని మనసులో కుతకుతలాడిపోయింది. అయితే ఇంక పార్వతి బతుకు తెల్లారిపోయినట్లే అని కుమిలిపోయింది.

ఒక నెల్లాళ్ళలో ముహూర్తం వుందిట దత్తత చేసుకోవటానికి. అంతా నిర్ణయమైపోయినట్లే. పార్వతి విషయం విని గంభీరంగా మారిపోయింది. రెండుసార్లు ఫిట్సు వచ్చాయి.

సూరమ్మ ముఖం చాటుచేసుకుని తిరుగుతున్నట్లు, అయినా అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు సుభద్రమ్మ అనుకుంది. చేజేతులా పార్వతి జీవితం నాశనం చేసుకున్నందుకు సుభద్రమ్మ వరసగా అందర్నీ తిట్టుకుంది.

ఆరోజు కనుచీకటి పడేవేళ రాములు వచ్చాడు. చిట్టిబాబు క్షేమ సమాచారాలు అడిగాడు.

" ఏముందండీ. పెద్దయ్యగారు మంచం దిగటంలేదు. కదల్లేకుండా వున్నారు. చూసే దిక్కూ లేదు. ఇంత గంజి కాసి పోసేవారూ లేరు. అమ్మగారక్కడికి వస్తే బాగుంటుందని చెప్పాలని వచ్చాను " అన్నాడు. ఆ మాటలు పదునైన కత్తి శబ్దం లేకుండా కోసుకుపోతున్నట్లు వున్నాయి.

" అవును. తనూ అనుకుంటూనేవుంది. బయలుదేరుతుంది. పాపం పెద్దాయన పుట్టెడు దుఃఖంలో వున్నాడు " అన్నాడు చిట్టిబాబు.

ఈ మాటలు విని సుభద్రమ్మ రగిలిపోయింది. ఎంత బాగా సూరమ్మని సమర్థించాడా అని లోపలే ఆశ్చర్యపోయింది. నిజానికి చిట్టిబాబు లోపల చిన్నబుచ్చుకున్నాడు. కానీ అలా అనకపోతే బాగుండ దని అన్నాడు.

" రేపు వెళ్ళు సూరమ్మా - పెదనాన్న అస్సలు లేవటం లేదుట " అన్నాడు.

మామగారి గురించి వెళ్ళాల్సివస్తోందని బాధగా వున్నా తప్పనిసరై సరేనంది. అక్కడ కూడా మాట దక్కించుకోవాలి. తన పై ఇద్దరి పిల్లలకీ వచ్చే ఆస్తీ పాస్తీ అదే కదా మరి.

"కబురొచ్చేదాకా కదలకపోతివి. ముందే వెళ్ళితే ఎంత మర్యాదగా వుండేది " అనేసింది సుభద్రమ్మ ఆపుకోలేక. సూరమ్మ మాట్లాడక వూరుకుంది. తెల్లారితే ప్రయాణం. చీకటి పడిపోయింది. పార్వతి పెందరాళే పడుకుంది. సూరమ్మ రమణని ఇక్కడే వుంచి వెడతానని చెప్పింది. ఆ మాట విని వాడు ఏడుపు అందుకున్నాడు. ఎంత వూరడించినా " నేను అమ్మతో వెళతాను " అంటూ రాగం ఆపలేదు.

" సరే వెళుదువుగానిలే " అంటేనే వూరుకున్నాడు.

చిట్టిబాబుని, ఆ ఇంటిని వదలాలంటే సూరమ్మ మనసు గిలగిల్లాడి పోయింది. నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లుతూ పడుకుంది. తనకి చిన్నప్పటినుంచి చిట్టిబాబు అంటే ఇష్టం. అనుకోకుండా తన పెళ్ళి మరోలా జరిగింది. కానీ ఈ నాటికీ తనలో మారుమూల దాగివున్న కోరిక తలెత్తుతూనే వుంటుంది. తనలో యవ్వనం అణగారక ముందే భర్త పోయాడు. తనలో కోరికలు కలతలు రేగడం తను భరించుకొస్తోంది. నిగ్రహించుకొస్తోంది.

*

నిద్రపోతున్న చిట్టిబాబు మీద వెచ్చని చేతులు పడ్డాయి. అతను వులిక్కిపడి కళ్ళు తెరిచాడు. సూరమ్మ ముఖం అతని చెంపలకు తాకుతోంది. వెచ్చని ఆమె ఊపిరి అతని ముఖాన్ని కాల్చివేస్తోంది.

" ఏమిటి " అన్నాడు. ఆ మాటలో ఆశ్చర్యం, భయం, అసహ్యం, జుగుప్సా కలిసివున్నాయి.

ఆమె రెండు చేతులతోనూ అతన్ని వాటేసుకుంది. ఆడ వాసన ఎరుగని చిట్టిబాబులో కోరిక నరనరాల్లో చర్రున పరుగుపెట్టింది. కాని అంతలోనే అతనిలోని వివేకం మేల్కొంది. .... ఏమిటీ పని ? ఇంత కంటే పతనం మరోటి వుంటుందా ? ఒక్కసారి తను జారిపోయాడంటే జీవితాంతం బంధింపబడిపోతాడు. ఛీ ! అయినా సూరమ్మకిదేం బుద్ధి. ఇలా ప్రవర్తిస్తోంది ! పార్వతి కుక్క ముట్టిన కుండ అయితే సూరమ్మ మాత్రం ఏమిటి ? ముగ్గురు పిల్లల్ని కని, భర్త పోయాక, తన పంచన చేరి తనకేం చేస్తోంది ? కుక్క ముట్టిన కుండని నిప్పుల్లో పడెయ్యాలని అస్తమానమూ అంటుంది. తననిప్పుడేం చెయ్యాలి ?

చిట్టిబాబు ఒక్కసారి విదిలించాడు. సూరమ్మ బిత్తరపోయింది. అతనాగదిలోనుంచి బయటికొచ్చేశాడు. తనేం తప్పు చెయ్యకపోయినా తనని అక్కయ్య చూసిందేమోనని సిగ్గుపడిపోయాడు. దొడ్లో చెట్టుకింద మంచం వాల్చుకుని దానిమీద వొరిగాడు. అతని మనసులో ఆలోచనలు కందిరీగల్లా ఒక్కసారి చెలరేగాయి.

ఆడవాళ్లు తమ స్థానాన్ని నిలుపుకోవడానికి ఏమైనా చేస్తారు. ఎంతో తాపత్రయపడతారు. అప్పుడు ఏం చెయ్యడానికైనా వెనుకాడరు. రమణని తను పెంచుకుంటే సూరమ్మకి తనింట్లో ఒక స్థానం వస్తుంది. అంతే కాకుండా ఇంకా ఏదో ఆశించి అసహ్యంగా ప్రవర్తించింది. తనంత బలహీనుడనుకుందేమో ? లేకపోతే తనమీద యిష్టాన్ని అణుచుకోలేక పోయిందో – ఏమైనా, తనూహించని దెబ్బ కొట్టింది. అది చలి పిడుగు లాంటి దెబ్బ.

తప్పుడు మార్గంలోపడి తనేదో సంపాదించుకోవాలని చూసింది సూరమ్మ. కాని పార్వతి అలాంటి ప్రయత్నం ఎప్పుడూ ఎందుకు చెయ్యలేదు ? తననుంచి ఇన్నేళ్ళు దూరంగా వుండి పార్వతి బాధ పడటం లేదా ! బాధ పడినా బయటికి చెప్పుకోలేక పోతోందా ! అసలు తను పార్వతియందు ఇంత నిరసన చూపించటం న్యాయమేనా ? తన కంటే పన్నెండేళ్ళు చిన్నది. తెలిసీ తెలియని వయసులో చేసిన తప్పును తనెంతవరకు క్షమించగలుగుతున్నాడు ? లేదు తను క్షమించలేడు. లోకానికి గొప్పగా కనిపిస్తూ అజ్ఞాతంగా ఆమెనెంత బాధిస్తున్నాడు ? అయితే తనిప్పుడేంచేయాలి ? పార్వతి ఆరోగ్యం పాడయిపోవడానికి తనే కారణం.

తప్పుచేసినవాళ్ళకి పశ్చాత్తాపపడి తప్పు దిద్దుకునే అవకాశం ఇవ్వకపోతే వాళ్ళు కుళ్ళి, కృశించిపోతారు. చిట్టిబాబు ఆలోచనలతో వేగివేగి నిద్రలోకి జారుకున్నాడు.

*

దమయంతిని చూడగానే సుభద్రమ్మకి ప్రాణం లేచివచ్చినట్లని పించింది.

" రామ్మా రా " అంటూ ఆహ్వానించింది.

" పరాశర్ ఏడి ? " అంది పార్వతి.

" వాళ్ళ తాతయ్యతో పొలం వెళ్ళాడు " అంది దమయంతి.

పార్వతి ముఖంలో నిరాశ కొట్టొచ్చినట్లు కనిపించింది.

సుభద్రమ్మ ఆపుకోలేక " దానికి పిల్లలంటే ప్రాణం-ఆ అదృష్టం మాత్రం దానికి లేకపోయింది " అంది.

" ఒకసారి ఎవరికైనా మంచి డాక్టరుకి చూపించకపోయారా " అంది దమయంతి.

సుభద్రమ్మ కళ్ళ నీళ్లు పెట్టుకుంది. మరింక కడుపులో విషయం దాచుకోవడం దుస్సాధ్యమైపోయింది. అందుకే ఆపుకోలేని ఆవేశంతో దమయంతికి అసలు విషయం చెప్పేసింది. అది విని దమయంతి స్థాణువులా వుండిపోయింది. ఒకే పొరపాటు స్త్రీ చేస్తే ఒకలాంటి శిక్ష, పురుషుడు చేస్తే మరోలాంటి శిక్ష. ఇదెక్కడి న్యాయం ? అదే స్థితిలో వున్న విశ్వాన్ని తను మన్నించి ఆదరించి పిల్లల్ని కని, అతని జీవితం విచ్ఛిన్నమైపోకుండా చేసింది ఒక్కొక్క సమయంలో ఎంతో అసంతృప్తిని, అశాంతిని దిగమింగింది. నిజానికి పార్వతిని చిట్టిబాబు క్షమించాడనికదూ - తను భ్రమపడింది ! లోపల యింత నాటకముందని తనకేం తెలుసు ?

చిట్టిబాబు ఇంత ద్రోహం చేస్తున్నాడని తను కనీసం ఊహించలేక పోయింది. మగవాడివల్ల పొరపాటు జరిగితే ఆడది క్షమించేస్తుంది. కాని అదే ఆడదాని విషయంలో మగవాడు క్షమించినట్లు నటిస్తాడు ....

దమయంతి మనసు భగభగ మండిపోయింది. ' ఆ క్షణంలో చిట్టిబాబు ఎదురుగా వుంటే తను కోపావేశాలతో ఏం మాట్లాడేదో ! '

' తనూహించిందంతా తారుమారైంది. పార్వతికి ప్రత్యక్షంగా జరుగుతున్న అన్యాయాన్ని ఎలా ఎదుర్కోవాలా ' అని మథనపడటం మొదలెట్టింది. ఎంత ఆలోచించినా ఒక్కచోటే ఆగిపోతున్నాయి. చిట్టడవిలో అంతవరకు కనిపిస్తూ వచ్చిన కాలిబాట ఆగిపోయినట్లు దమయంతి మరేమీ మాట్లాడలేక నిశ్చేష్టయి కూర్చుండిపోయింది.

" ఇలాంటి సంసార విషయాల్లో ఎవ్వరూ వాద ప్రతివాదాలతో సంసారం చక్కదిద్దలేరు. కాపురాలు నిలబెట్టలేరు. కొన్నింటికి

ఆర్గ్యుమెంట్ వుండదు. నిజానికి తనే మనసు తిప్పుకుని విశ్వం దగ్గరకు వెళ్ళిపోయింది. ఎన్నో అసంతృప్తులమధ్య జీవితాన్ని నెట్టుకొస్తోంది. అదీ కానినాడు తనవెవ్వరూ వొప్పించి వాదించి, అతని దగ్గరికి పంపగలిగే వారు కారు .... ”

ఆవేదనతో, అసంతృప్తితో ఇంటి ముఖం పట్టింది దమయంతి.

*

నూతి పళ్ళెం దగ్గర పెద్ద చప్పుడైంది. పార్వతి ఉలిక్కిపడి దొడ్లోకి పరుగెట్టింది. అక్కడ పడిపోయి వుంది సుభద్రమ్మ. చెయ్యీ, కాలూ స్వాధీనంలేక లేవలేకపోతోంది. పార్వతి కంగారుగా తల్లిని లేవనెత్తింది. ఆమె వొళ్ళంతా వొణికిపోతోంది. ఊగిపోతోంది. పనిమనిషి సాయంతో లోపలికి తీసుకొచ్చి, పడుకోబెట్టింది. చిట్టిబాబు డాక్టరుకోసం పరుగెత్తాడు.

పార్వతి తల్లి మంచం పక్కనే కూర్చుంది. కళ్ళల్లో నీళ్ళు ఎంత ప్రయత్నించినా ఆగడం లేదు. తల్లి మూలుగుతుంటే గుండెల్లో గునపాలు పెట్టి పొడుస్తున్నట్లు బాధపడింది. ఎడం కాలు చెయ్యి కదపలేకుండా వుంది. అప్పుడప్పుడు వాటంతటవే దడదడలాడిపోతున్నాయి. చుట్టు పక్కలవారు చాలామంది చేరారు. ఓదార్పులు వేదాంతాలు వల్లె వేస్తున్నారు. సుభద్రమ్మకి ఆగి ఆగి తేనె పట్టిస్తున్నారు కొందరు.

డాక్టరు వచ్చి, ఏదో ఇంజక్షన్ చేసి, మందులిచ్చేసరికి బాగా పొద్దుపోయింది. ఎవరో పక్కింటావిడ కాస్త అన్నం వండిపెట్టింది. తల్లి మంచానికి అంటుకుపోయింది పార్వతి. ఆమెకున్న ఒకే ఒక్కతోడూ నీడా తల్లి. సాయంత్రం తల్లి కాస్త నిద్రలోకి జారుకుంది, విశ్రాంతిగా. అప్పుడు మొదటిసారిగా పార్వతి ఆ ఇంట్లో వంట ప్రయత్నం చేసింది.

ఇన్నాళ్ళూ ఏవేవో పై పనులు చేసినా ఎప్పుడూ తనే వంట చెయ్యాల్సిన అవసరం ఏప్పుడలేదు. కాని తల్లి వెంటవెంటనే వుండి అన్నీ చూసేది. ఈరోజు తనే వంట మొదలుపెట్టింది.

పార్వతి మనసు తీవ్రంగా మరో పైపునుండి ఆలోచించటం మొదలు పెట్టింది. చిన్న ఆశ రేకెత్తింది. గతాన్ని తలచటం మానేసింది. జీవితంలో ఒకే ఒక్క అనుభవం తలుచుకుంటే భయంతో వొణికింది. దాన్ని మరిచిపోయి మరో పైపు మళ్ళిపోవడానికి మరో ఆలంబన కరువైంది. నిజానికి తనారోజు ఏ దుష్టశక్తి చేతనో అలా లాగబడింది. లేకపోతే ఈపాటికి తను పిల్లలతో అందమైన సంసారంతో తిరుగాడుతూ వుండేది. ఇప్పుడు అమ్మ ఏమైనా అయిపోతే తనీ ప్రపంచంలో ఒంటరిదైపోతుంది. కాని అలా జరగటానికి వీల్లేదు. తనెందుకు తన భర్తని దక్కించుకోలేదు ? ఒక్కసారి మావయ్యతో మనసు విప్పి మాట్లాడాలి. తన తప్పుని ఒక్కసారి క్షమించమని అడగాలి. అప్పుడతను నిరాకరిస్తే తనింక బ్రతకడం వృథా ! ఇలా యావజ్జీవం శిక్ష అనుభవించటంకన్నా ఒకేసారి ప్రాణం తీసుకోవడం మంచిది. పార్వతి పని చేస్తున్నా ఆలోచనలు ఉత్సాహంగా కదిలిపోతున్నాయి.

చిట్టిబాబులో కరుడు కట్టుకుపోయిన కాఠిన్యం కరగడం మొదలు పెట్టింది. ఎంతో ఆత్మీయంగా వుండే అక్కయ్య మంచానపడ్డం అతనికి పెద్ద దెబ్బయింది. పార్వతి బాధగా, అమాయకంగా అన్నీ చేసుకుపోతోంది. ఆమెని చూస్తుంటే జాలితో గుండె కరిగిపోతుంది. ఆమెని పలకరించేవాళ్ళు లేక ఎంత తపించిపోతోందో — అని చిట్టిబాబు మధనపడటం మొదలు పెట్టాడు.

ఈ రెండు రోజులూ చిత్రంగా గడుస్తున్నాయి. సూరమ్మ వెళ్ళిపోయింది. సుభద్రమ్మ లేవటంలేదు.

ఆరు నెలల క్రితం చనిపోయిన తల్లి పదే పదే గుర్తుకొస్తోంది. ఆమె కంటే ఆమె తనని పిలిచి దగ్గర కూర్చుండబెట్టుకుని తరుచు చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి.

" చిట్టీ! పార్వతి వట్టి అమాయకురాలు. దానికేం తెలీదు. దాన్నేదో మందో మాకో పెట్టి ఎవరో ఏదో చేశారు – చిన్ననాటి నుంచి నా చేతుల్లో పెరిగిన పిల్ల, దాన్ని బాధించకు. ఉసురు పెట్టకు నాయనా! మన పిల్ల అది. నీకూ పరాయిది కాదు. మనమే దాన్ని బాధిస్తే, ఎవరు కాపాడుతారు" అంటూ తను దగ్గరకి వెళ్ళిన వెంటనే అనేది. అప్పట్లో తనకా మాటలు వింటే చాలా కోపంగా వుండేవి. కానీ ఇప్పుడు అవి తల్చుకుంటే నిజమేనేమో అనిపిస్తున్నాయి. ఏది ఏమైనా పార్వతిని క్షమించటం తన కర్తవ్యం అనిపిస్తుంది – నిజానికి ఆనాటి నుంచి పార్వతి ఎలా ప్రవర్తించిందో ఆలోచించుకుంటూ మనసులో అతను ఆత్రుత పడటం మొదలు పెట్టాడు.

*

చిట్టిబాబు విస్తరి దగ్గర కూర్చున్నాడు. ఆ రోజు పార్వతి మనసు చిత్రంగా వుంది. అది లయ తప్పుతోంది. ఒకే రకమైన ఆనందం, స్వేచ్ఛ, హృదయాన్ని ఎక్కడికో మోసుకు పోతున్నాయి. తల్లి మాటలలోంచి విని, మావయ్యకి ఇష్టమైనవి వండింది.

ఆనపకాయ అవపెట్టి కూర చేసింది. మజ్జిగ పులుసు పెట్టింది. పప్పు, కొబ్బరి పచ్చడి చేసింది. ఈ రోజుకి అమ్మ లేవక మూడు రోజులైంది. అమ్మ అలా వుందని బెంగతోనే ఏదో ఆశ ఆమెలో కలవర పెడుతోంది.

అతను పలకరించకపోయినా తనే మాట్లాడాలి అని పార్వతి నిర్ణయించుకుంది.

రాత్రి గేదె అంతకష్టపడి లేగదూడని కంది. దాని బాధని చూసి, తల్లడిల్లిపోయిన పార్వతి, తెల్లారినాక దానిముఖంలో ఎంతో ప్రశాంతత వున్నట్లు చూసింది. తను ప్రకృతి నుంచి మరెటో పయనిస్తున్నట్లనిపించింది. తను మరికొంత చనువు తీసుకుని తన బ్రతుకు పండించుకోవాలని ఆరాటంగా వుంది.

అంత పెద్ద ఇంట్లో తమిద్దరే అక్కడ వున్నారు. పడమటింటిలో అమ్మ నిద్రపోతోంది.—

చిట్టిబాబు తలొంచుకుని మాట్లాడకుండా భోజనం చేస్తున్నాడు.

"వంట బాగుందా బావయ్యా?" అంది ప్రాణాలెట్లో బిగపట్టి.

చిట్టిబాబు ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యపోయాడు. ఇన్నేళ్ళ కాలంలో ఒక్కసారి కూడ నోరువిప్పి తనతో మాట్లాడని పార్వతి ఈ రోజు నేరుగా తనతోనే మాట్లాడటంతో కొంచెం తత్తరపడ్డాడు. అతని మనసులోని కోరిక కూడా అదే అయినా ఎలాగో అయిపోయాడు. తలెత్తి ఆమె వంక చూశాడు. విశాలంగా వున్న కళ్ళమీద సోగగా రెప్పలు వాలివున్నాయి. పాలనురగలాంటి చెక్కిళ్ళ మీద పసుపు వింత అందాల్ని వెదజల్లుతోంది. తలంటుకున్న జుట్టు చెవులమీంచి జారి చెవులకున్న తెల్లరాళ్ళ దుద్దులు మబ్బుల చాటు నుండి మెరిసిపడే వెన్నెల్లా వున్నాయి. ఒక్క త్రుటి కాలంలో ఇదంతా పరిశీలించిన చిట్టిబాబు అవాక్కయి వుండిపోయాడు. అప్పుడే గుర్తు కొచ్చింది, ఈ మూడు రోజులూ పార్వతికి ఫిట్స్ రాలేదని —

ఆ క్షణంలో అతనికి ఏ పాత జ్ఞాపకాలూ రాలేదు. తనకంటే ఎంతో చిన్నదైన పార్వతిని తనెంతో జాగ్రత్తగా, అపురూపంగా

చూసుకోవాలి అని బలంగా అనిపించింది. ఎంత తప్పు చేసినాసరే తనామెను క్షమించాలి - పసితనంతో కళ్ళు మిలమిల మెరుస్తూ భయంతో తడబడుతున్నాయి.

" బాగుంది. ఇవన్నీ ఎప్పుడు నేర్చుకున్నావు " అన్నాడు. చిరునవ్వు అతని పెదవుల మీద మెరిసింది. పార్వతి మనసు లేత చిగుళ్ళు మేసిన లేడిపిల్లలా గెంతింది దాచుకుందామన్నా ఆనందం దాగేట్టులేదు. కళ్ళల్లో పొంగి అవి చెంపల మీద వెల్లువవుతోంది.

" ఏం ? నీకిష్టమైనవి నాకు మాత్రం తెలీవా " అంది చనువుగా. అతనూ నవ్వేసి ఊరుకున్నాడు —

సుభద్రమ్మకి వచ్చింది స్వల్పమైన పక్షవాతం మందులు రాసిచ్చి త్వరలో నయమైపోతుందన్నారు డాక్టర్ - అందుకని ఆ బెంగ పార్వతిని వదిలేసింది.

ఆ రోజు వెన్నెల రాత్రి కాకపోయినా పార్వతి మనసు నిండా వెన్నెల కాసింది.

ఆనందంతో అన్నం సహించలేదు. ఒక్కటే - ఈ రోజు మావయ్య పాదాలు వదలకూడదు. ఇలాగే మావయ్య తనతో నవ్వుతూ మాట్లాడితే చాలు. అదే పదివేలు —

చిట్టిబాబు పనుండి బయటకెళ్ళిపోయాడు. పార్వతి కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగింది. ఏవేవో సర్దింది. సుభద్రమ్మకి ఏమేం కావాలో శ్రద్ధగా చూసింది. పూజగదిలోనికి వెళ్లి దేవుడికి నమస్కారం పెట్టుకుంది. దేవుడి పాదాల దగ్గర పువ్వు తీసుకుని కళ్ళకద్దుకుని తలలో పెట్టుకుంది.

అందంగా జడ వేసుకుంది. తీరుగా కాటుక, బొట్టూ పెట్టుకుంది. పాతబడిన చీర వదిలి, తెల్లని జరీచీర కట్టుకుంది —

చిట్టిబాబు ఇంటికొస్తూనే ఓరకంట పార్వతిని చూసి ఆశ్చర్య పోయాడు. తను ఒక్కమాట పలకరిస్తే, ఇంత పొంగిపోయిందా! ఒక్కొక్కక్షణం అల్లకల్లోలమై పోతోందతని మనసు. మరో క్షణం ప్రేమతో ఊగిపోతోంది. మరొక్కసారి జాలితో కరిగిపోతోంది.

ఏం తోచక పుస్తకం తీసుకుని మచంమీద వాలాడు. కళ్ళు అక్షరాల్ని చూస్తున్నాయిగాని, మస్తిష్కం మారుమూల జ్ఞాపకాల్ని తవ్వి బయటపడేస్తోంది.

పార్వతి అద్దంలో తనని ఒక్కసారి చూసుకుంది. వొళ్ళంతా గగుర్పాటుగా వుంది. మంచినీళ్ళు తీసుకుని అడుగు వెయ్యబోతే కాళ్ళు వణికాయి. కళ్ళు మూసుకుని దేవుని ప్రార్థించింది. ఏమని? ఏమో! అది ఆమెకీ పూర్తిగా తెలీదు. అంతలోనే ధైర్యం వచ్చినట్లు అడుగు ముందుకేసింది.

పార్వతి తన గదిలోకి వచ్చిందని గ్రహించి, చిట్టిబాబు ఊపిరి బిగబట్టి పుస్తకంలోకి మరీ తీక్షణంగా చూ డ సా గా డు. పార్వతి మంచినీళ్ళక్కడ పెట్టి, ఏవో సర్దుతున్నట్టు అక్కడే నిలబడింది. ఒక్కసారి కోపం వచ్చింది చిట్టిబాబుకి. ఇది తనని వలలో వేసుకోవడానికి ఎత్తా అని కర్కశంగా అయిపోయింది. పుస్తకం పక్కన పడేసి లేచి కూర్చున్నాడు. పార్వతి నిలువెల్లా వణికింది.

“ ఎందుకిక్కడికి వచ్చావు ? ” అన్నాడు. నిజానికి అందామనుకున్నంత కరుకుతనం ఆ మాటల్లో రాలేదు. పార్వతి సమాధానం చెప్పలేదు. అతని మంచానికి పక్కగా నేలమీద కూర్చుండిపోయింది.

“ మావయ్యా ” అంది. మరో మాట నోట్లోంచి పెగలిరాలేదు. కళ్ళనిండా నీళ్ళు, నయాగరా రెండుగా చీలి నయనాశ్రు జలపాతాలై దూకపోతున్నట్లు వున్నాయవి.

చిట్టిబాబు చలించిపోయాడు, ఆ క్షణంలో ఆతనికి అస్తమానం తన ముసలి తల్లి చెప్పే మాటలు మళ్ళీ గుర్తుకొస్తున్నాయి.

" ఎవరో మందో మాకో పెట్టివుంటార్రా. లేకపోతే పార్వతి అలాంటి పిల్లకాదు "

చిట్టిబాబులో కోపం ఒక్కసారి దిగిపోయింది. అదే నిజమై వుండాలి. లేకపోతే ఇంత అమాయకురాలు అంతటి అప్రాచ్యపు పని చేయదు.

అతను అప్రయత్నంగా తలమీద చెయ్యివేశాడు. అతని వొడిలో తలపెట్టి వెక్కి వెక్కి ఏడ్చింది. అతనికీ కళ్ళంట నీరొచ్చింది. ఆమెని దూరంగావుంచి అతను మాత్రం సుఖపడిందేమీ లేదు. కసితో కడుపు నింపుకుంటూ వస్తున్నాడు.

రెండు చేతుల్లోకి ఆమె ముఖం తీసికుని కళ్ళల్లోకి చూశాడు. సముద్రాంతర్భాగంలో నిధులు దాగివున్నట్లే ఆమె మనసులో అనురాగపు మణులు నిక్షిప్తమైవున్నట్లు అతని కనిపించింది. అతను గాఢంగా ఆమె ముఖాన్ని గుండెలకదుముకున్నాడు. ఆమె సున్నితమైన లతలా అతన్ని చుట్టేసుకుంది. ఎన్ని యుగాలుగానో ఎదురుచూస్తున్న కలయికలా వారిద్దరూ పెనవేసుకుపోయారు.

అలాగే అతని చేతుల్లో అచేతనంగా వుండిపోయింది పార్వతి. చిట్టిబాబు కంగారుగా ఆమెని మంచంమీద పడుకోబెట్టి —

" పార్వతీ పార్వతీ " అంటూ పిలిచాడు. ఆమె నెమ్మదిగా కళ్ళు తెరిచింది. అతనిచ్చిన మంచినీళ్ళు తాగి లేచి కూర్చుంది. సిగ్గుతో ఆమె ముఖం ముద్దమందారమైంది.

0 0 0